

అభ్యుదయ



Distributors:

The Premier Films Ltd., Bezwada.

కుష్టు - బొల్లి

మొదలగు సకల మేహములకు, ఇతర చర్మవ్యాధులకు, సెగ, సవాయి మొదలగు వ్యాధులకు

గ్యారంటీ చికిత్స!

బ్రాంచి

బెజవాడ
గాంధీనగరం

★

వాల్తేరు
ఆర్ యస్ పోస్టు

★

ఆఫీసులు

సికింద్రాబాద్
3560 కింగ్సువే

★

కటక్
బక్సీబజారు

"మునిగిపోదామనుకున్నాడు"

హెచ్. బావాజీ దేహాలో,
కల్లంబల్లి, కల్లంబల్లి
చామరాజనగర్ పోస్టు, మైసూరు 10-1-1945

అయ్యా!

క్రిందటిసారి మీవద్ద తెప్పించిన అత్యద్భుత కుష్టు రోగనివారిణి మొదటిసారిగా కగిల్లా వాడాడు. ఆయన అమితానందంతో నా దగ్గరకు వచ్చి, తన శరీరంమీది మచ్చలను నాకు చూపించాడు. మీ మందు ఒక్కసారి వాడేసరికే మచ్చలు దాదాపు నయమైపోవటం నాకాశ్చర్యం కలిగింది. ఇప్పుడు ఆయన మనిషి మొత్తం పూర్తిగా మారిపోయినట్లున్నాడు. ఆయన మీ మందు పుచ్చుకోకముందు తన వ్యాధి నయం కాదనే నిరాశ వల్ల నీటిలోపడి చనిపోదామనుకున్నాడు. ఇప్పుడటువంటి భావాలు ఏమీలేవు. ఆయన కృతజ్ఞతాభివందనాలను నేను మీకు తెలియజేస్తున్నాను. మళ్ళీ మీ మందును వి. పి. ద్వారా పంపగోరుచున్నాను.


మీ విశ్వాసపాత్రుడు,
(సం.) హెచ్ బావాజీ దేహాలో

పెద్ద తెలుగు క్యాటలాగు, 10 భాషల్లో క్యాటలాగులు
యోగ్యతాపత్రములు— ఉచితం!

రెడ్డి & కో
(రిజిస్టర్డు)

REDDY

H O గోపాలపురం - నయాతలుక, తూర్పు గోదావరి




స్వతంత్ర భారత ప్రధాని పండిత నెహ్రూ

అభ్యుదయ

సచిత్ర సాహిత్య మాసపత్రిక

సం ౧, సంచిక ౧౦ ఆగస్టు, 1947



సంపాదకీయం ★ ★

ఆగస్టు 15

నవభారత జాతీయపతాకం ఈనాడు హిమాలయోత్తుంగ శిఖరాంచలాలపై రెపరెపలాడుతూ కన్యాకుమారి ఉజ్వల తరంగాలపై కాంతులీనుతూ స్వతంత్ర జాతీయ వికాసాన్ని దిక్కుదిక్కునా వెద జల్లుతుంది. ఇన్నేళ్ళుగా భారత స్వాతంత్ర్య పోరాటానికి ఆత్మబలి దానం చేసుకున్న వీరమూర్తుల ప్రాణవాయువులను ప్రసరిస్తుంది. ఈనాడు యావద్భారతజాతి ఆనందోత్సాహాలతో, నూతన చైతన్యంతో నూతన తేజస్సుతో కళకళ లాడుతుంది.

ఇది నవభారతానికి శుభోదయం. శతాబ్దాల కారుచీకట్లు పటాపంచలైపోయి, భారతీయులు తొలిసారిగా దర్శిస్తున్న మహోదయం ఇదే; ఇదే స్వతంత్ర భారతజాతికి తొలి ఉగాది !


ఏ త్యాగధనుల తేజోమూర్తి యీ మహోదయాన్ని దీప్తిమంతం చేసిందో మనం మరచిపోలేము. వారు ఏ మహదాశయం కోసం తమ అమూల్య జీవితాలను సైతం అంకితంచేశారో ఆ మహదాశయమే మన జీవిత పురోగమనానికి మార్గదర్శకం కావాలి.

మనిషిమనిషిని ద్రోచుకుతినేసమాజం, పత్రికావాక్సభా స్వాతంత్ర్యాలపై ప్రతిబంధకాలు, లాఠీలు, జైళ్లు, ఉరిస్తంభాలూ ఉన్నంతకాలం మనం ఆమహదాశయాన్ని సాధించినట్లుకాదు. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలూ, సమానతా శాంత్యభ్యుదయాలూ సాధించగలిగిననాడే మనం మనకర్తవ్యాన్ని నెరవేర్చినవాళ్ళం కాగలం.

జాతీయపునర్నిర్మాణంలోని ఈమహత్తర కర్తవ్యనిర్వహణలో కళాకారులందరూ నూతనసంస్కృతిని ప్రజలకు అందచేయడానికీ రెండు ఖండాలుగా విడిపోయిన మాతృభూమిని సమైక్యంచేయడానికీ తమ నిత్యజీవిత పోరాటంలో ఉజ్వలభవిష్యత్తుకు పురోగమిస్తున్న ప్రజానీకానికి నైతికబలాన్నీ, ఉత్తమచైతన్యాన్నీ, వ్యక్తిత్వాన్నీ, శక్తిసామర్థ్యాలనూ తమ కళాప్రతిభద్వారా సమకూర్చడానికి, ఈరోజున నవభారతపతాకనీడల్లో ప్రతిజ్ఞ తీసుకోవాలి.ఇదే మనకళాభ్యుదయానికి వెలుగుబాట!

నీచపు దాస్యవృత్తి మన నేరని శూరత మాతృదేశ సే
వాచరణమ్ము నందసువు లర్పణ చేసిన వారి పార్థివ
శ్రీ చెలువారుచోట తదసృగ్రుచులన్ వికసించి, వాసనల్
వీచుచు రాలి పోవగవలెన్! తదుదాత్త సమాధిమృత్తికన్"

— వేముల



స్వాతంత్ర్య గీతాలు

శ్రీ మలవరపు విశ్వేశ్వర రావు

—: :—

స్వారాజ్యపతాక మ్మెగసెను
అల ఢిల్లీ ఖిల్లాపై
స్వాతంత్ర్య స్పందన మ్రోసెను
ఆసేతుహిమనగమైత్రి
భరతావని నవతారుణ్యము
వెలివిరిసిన తోరణమ్మై
చిరదాస్యవిమోచన మిపుడని
కలకింకిణి సంకులమ్మై ॥స్వా॥

త్యాగాత్ము లశోకమహాత్ముల
చక్రాంకిత ముద్రికతో
ఆకాశ పథాంచల చంచల
స్వాతంత్ర్య విహంగమమ్మై ॥స్వా॥

యుగయుగముల చక్రభ్రమణపు
ఒరపెడిని పెరిగి తరిగి
చిగురించిన వరభరతావని
విజయ స్తంభాగ్రముపై ॥స్వా॥

భూమండలి సరజాతీయత
వర్ధిల్లు సంతవరకు
దిఙ్మండలి యువయుగ భారతి
సుందర చేలాంచలమ్మై ॥స్వా॥

2

చిరకాలపు స్వప్నము నిజమై
భరతాలయ శిఖరము వెలుగై
పరవీక్షిత నరులకు వరమై
స్వాతంత్ర్య దినోదయ మొదవె నోహో
పరతంత్రపు తిమిరము చెదరె నోహో

జాతీయత కాదర్శమ్మై
జనబంధు గాంధి విజయమ్మై
జగదేక నయనపర్వమ్మై
స్వాతంత్ర్య పతాక మ్మెగసె నోహో
పరతంత్రపు దాస్యము ముగిసె నోహో

శతకోటి హృదయ హర్షమ్మై
శతకోటి వినత శీర్షమ్మై
శతకోటి గళన్మధురమ్మై
స్వాతంత్ర్య ఫలశ్రుతి మొరసె నోహో
పరతంత్రపు దుస్థితి కడచె నోహో

★ స్వాగత సంగీతం ★

శ్రీ 'అజంతా'

పడిన
విషవృక్షం నీడలపై
నీలిమంటలో
కెవ్వుమన్నది
శత్రువు తుది నిశ్వాసం.

సంకెల
తెగి పడినచోట
నరుడొక నగశిఖరమై
లేచినాడు.

అమ్మా!
గతజీవితశిథిలాలపై
విడిచిన అడుగు జాడలో
వినపడే విషాదగీతిక
విజయఘోషలై
నీ పెదవి దాటినది.

బ్రతుకు బైట
మృతవీరుని పెదవిలో
ప్రతిధ్వనులై
పైకెగసినది.

జయధ్వానమై
జలధు లూగించినది.

అమ్మా!
అటు చూడు!
రేయి చివర
రెక్క విప్పిన పసిడిమబ్బు
వార్ధికి వారధి గట్టినదే!
జగతి గుండె జలదరించి
జైగీతం పాడినదే!

ఆకసమొక ఆనందాశ్రువై
నీ కనురెప్పల్లో
ఆశ లల్లినదే
కాలం నీ నుదుట
కుంకుమరేఖలై నిలచినదే!

కొమ్మకింద కదిలే
ఉదయానిలవీచిక
రాబోయే సుఖదినాల
చేతులెత్తి పిలిచినదే!

అమ్మా!
ఒడ్డుకొచ్చిన
కడలి కెరటం
విడిచిన నిశ్వాసపు నిశ్శబ్దం
లేమి లేని లోకానికి
స్వాగత సంగీతం.

విశ్వకవి రవీంద్రనాథ్

శ్రీ 'అమరేంద్ర'

ఇటలీకి డాంతే, జర్మనీకి గెటే, ఇంగ్లండుకి షేక్స్పియర్, భారత దేశానికి రవీంద్రుడు. ఒక జాతి నాగరికతనీ, సంస్కృతినీ, ప్రతిభనీ రచనలో సంపూర్ణంగా ప్రతిఫలించగల అపర్వకవి ఒక్కడే వుంటాడు. ఆ కవి ఒక్కడే ప్రపంచములో తనజాతికి ప్రతినిధిగా నిలబడగలగటానికి సమర్థుడవుతాడు. ఒక్కొక్క దేశంలో ఎందరో కవులుండవచ్చును. ఇటువంటి అర్హత సంపాదించుకోగల కవి, జాతి తపస్సు చేయగాచేయగా ఎప్పుడో ఒక్కడు ఉదయిస్తాడు. ఆ జాతి వ్యక్తిత్వమంతా ఆకవిలో పూర్తిగా మూర్తీభవిస్తుంది. తన దేశం తరఫున ప్రతినిధిగా నిలబడి తన జాతి విశిష్టతనీ, తనసభ్యతా ప్రత్యేకతనీ ప్రపంచానికి ప్రకటించగల అధికారం, గౌరవం ఆ ఒక్క కవికే దక్కుతయ్.

ప్రపంచమంతా సంచారం చేసి మన సంస్కృతిని ప్రచారం చేసే అర్హతని రవీంద్రుడు కేవలం తన కవిత్వంవల్లనే సాధించాడు. రవీంద్రుడు ఏ దేశంవెళ్ళినా అక్కడి ప్రజలు ఆయనని భారతదేశానికే కాక పురాతనమైన ప్రాచ్యసంస్కృతికంతకీ ప్రతినిధిగా, మూర్తీభావంగా స్వీకరించి బ్రహ్మాండమైన స్వాగతమిచ్చారు. భారతదేశాన్ని చూడనివారు రవీంద్రుని దర్శించి, ఆయన పలుకులు ఆలకించి, భారత నాగరికతని అవగాహనచేసుకున్నట్లే తృప్తిపడ్డారు. ఆయన వేషం, ఆయన భాషా, ఆయన సాహిత్యం భారత దేశ ప్రతిష్ఠని ఖండఖండాంతరాలలోని ప్రజల హృదయాలలో చెరిగి పోకుండా ముద్రించినయ్.

ఆధునిక కాలంలో ఈ మహాత్కార్యాన్ని రవీంద్రులు కవిత్వం ద్వారా సాధించారు. ఆయన వేదాంతి కావచ్చును. సంస్కర్త కావచ్చును. గాయకుడు, నటుడు, చిత్రకారుడు, విద్యావేత్త, సాధకుడు కావచ్చును. కావచ్చునేమిటి? అన్ని శాఖలలోనూ విశేషమైన

ప్రజ్ఞన్ని వెల్లడించారు. కాని ముఖ్యంగా ఆయనకవి. కవిఅయిన తరవాతనే మిగిలినవన్నీ. 'కవిత్వమనే తాళంచెవితోనే జీవితంలోని రహస్యగృహాలలో ప్రవేశించాను' అని గర్వంగా చాటుకున్నాడు

కనక వంగకవి రవీంద్రుడు జాతీయకవిగా, జాతీయకవి విశ్వకవిగా మారిన పరిణామాన్ని పరిశీలించాలి. ఈ పరిణామంలోనే రవీంద్రుని ప్రతిభ గోచరిస్తుంది. ఈ పరిణామం రవీంద్రుని ఇరవై ఒకటో యేట మొదలయింది. ఆయన ఈ లోకానికి వీడ్కోలు చెప్పేవరకూ ఈపరిణామం అప్రతిహతంగా అద్భుతంగా సాగింది. ఈ పరిణామమే రవీంద్రులు భువినుంచి తరలిపోయిన తరుణంలో గాంధీజీ చేత ఈవిధంగా పలికించింది. "ఈనాడు ప్రపంచమే ఒక మహాకవిని కోలుపోయింది"

రవీంద్రుడు వంగసాహిత్యంలో ఉదయించేటప్పటికి ఎందరో మంచి కవులుండేవారు. నవీనచంద్ర, బిహారీలాల్, రజనికాంత, సత్యేన్‌దత్, అక్షయబొరల్ వంటి పేరుమోసిన కవులున్నారు. బంకించంద్ర ఛటర్జీ ఆనాటి సాహిత్యచక్రవర్తి. చిన్నప్పటినుంచీ కవిత్వంరాసి ప్రకటించేవాడు రవీంద్రుడు. కాని అందరినీ ఆకర్షించిన మొదటి కావ్యం "సంధ్యాసంగీతం". ఈకావ్యాన్ని చదివి, బంకింబాబు పొంగిపోయాడు. వంగసాహిత్యంలో ఒక ఉజ్జ్వలతార ఉదయించిందనుకున్నాడు. తరవాత ఒకవిందులో ఆయన రవీంద్రుని కలుసుకున్నాడు. ఆ విందులో బంకిం మెడలో పూలమాల వేయబోతే వారించి ఆ మాలని అప్పటికి అనామకుడుగావున్న రవీంద్రుని మెళ్లో వేయించాడు. 'ఈయనే ఇక మీకవి' అన్నాడు. ఈదృశ్యం ఎప్పుడూ రవీంద్రుని హృదయంలో మెరుస్తూ వుండేది.

రవీంద్రుడు ఉదయించగానే ధగధగా మెరిశాడు. ఈ ప్రకాశం ముందు మిగిలిన కవులంతా వెలవెల బోయారు. ఆయనగానంలోని అపూర్వమైన స్వేచ్ఛా, అద్వితీయమైన మాధుర్యమూ అందరినీ ముగ్ధుల్ని చేసినై. వంగసాహిత్యంలో ఒక కొత్త అధ్యాయం మొదలయింది.

ఈ సమయంలోనే "నిర్ఝర స్వప్నభంగం" అనే గీతమూ, "ప్రకృతిప్రతిశోధం" అనే నాటకమూ వెలువడినై. ఇవి చరిత్రాత్మకమైనవి. రవీంద్రుని భావిపరిణామాన్ని సూచించే అద్భుతరచనలు. ఇవి ఆయన కవిత్వానికీ తత్వానికీ ప్రాతిపదికలు.

ఒక ప్రశాంతమైన ప్రభాత సమయంలో రవీంద్రుడు ఒంటరిగా ఇంటిముందు తిరుగుతూన్నాడు. గుండెలమీద కొండలబరువు. ఏదో విషాదం, చీకటిఅలుముకొని మనసు చికాకుపడిపోతోంది. ఎన్నాళ్ళనుంచో ఈఅర్థంకాని వేదనతో కుమిలిపోతున్నాడు. చెట్లగుబుర్ల వెనకఉదయిస్తున్న సూర్యుడికేసి చూస్తూనివ్వెరబోయి నిలబడ్డాడు. కళ్ళముందరినుంచి నల్లటి తెర ఏదో చరచరతొలగి పోయినట్లనిపించింది. ఆక్షణంలో జగత్తంతా కాంతితో, శాంతితో, ఆనందంతో, సౌందర్యంతో,నిండితొణుకుతున్నట్లనిపించింది. ఏదో చెఱనుంచి బైటపడ్డట్లనిపించింది. అప్పుడే "నిర్ఝరస్వప్నభంగం' రచించాడు. కొండగుహాలలో చీకటిలో ఒకసెలయేరు నిద్రపోతూంటుంది. దూరంనుంచి సముద్రపు పిలుపువినపడుతుంది. సెలయేరు నిద్రమేలుకొని శిలలసంకెలలని ఛేదించుకుంటూ వెలుగులోకి సముద్రంవైపుకి పరుగులుతీస్తుంది. తనక్షుద్రమైన సుఖదుఃఖాలలో సతమతమైపోతున్న కవిహృదయం సెలయేరు. దైన్యంతో, దారిద్ర్యంతో, దుఃఖంతో, తనదిక్కుకు రమ్మనిపిలిచే లోకం సముద్రం. లోకంసుఖదుఃఖాలలో తానులీనమైపోయిననాడే తనకవిత్వానికి ధన్యత చేకూరుతుందని రవీంద్రుడు ఆనాడుగ్రహించాడు. ఈ పరమసత్యాన్ని గ్రహించినక్షణమే రవీంద్రుడు విశ్వకవిపీఠాన్ని ఆరోహించటానికి మొదటిమెట్టు మీద అడుగుపెట్టాడు.

వైరాగ్య సాధనవల్ల వచ్చే మోక్షంనాకువద్దు. ఈలోకంలోని సుఖదుఃఖాల నన్నిటినీ తనివితీరా అనుభవిస్తాను. అని నిశ్చయించుకున్నాడు. లోకంనుంచిదూరంగా తొలగిపోవటంవల్ల జన్మతరించదు. ప్రేమతత్వంద్వారా ప్రపంచంలోనే ముక్తిని సాధించవచ్చును. రవీంద్రుని తత్వానికి మూలసూత్రమైన ఈ విశ్వాసాన్ని 'ప్రకృతిప్రతిశోధం'లో వెల్లడించాడు..

ఈ విశ్వాసంతో ఆరంభమైన రవీంద్రుని కవిత్వం దినదినమూ విస్తరించి వర్ధిల్లింది. లోకంతో సన్నిహితబాంధవ్యంఏర్పడి నానాటికీ బలపడింది. తన దేశీయుల జీవితంలోని ప్రతి మారుమూలకీ ఆయన కవిత్వం ప్రవహించింది, తన దేశీయుల విజ్ఞానాన్ని, సంస్కృతినీ, సంగీతాన్ని, నృత్యాన్ని, చిత్రకళనీ, నాట్యకళనీ, ఉపనిషత్తులనీ, బైరాగుల పదాలనీ, జానపదగీతాలనీ, వైష్ణవ కవిత్వాన్నీ, శక్తిపూజనీ, కవిత్వంలో మేళవించుకున్నాడు. జాతీయ విజ్ఞానానికి, విశిష్టతకీ రవీంద్రుని కవిత మూర్తీభావం.

కవి అనే గర్వంతో ప్రజల జీవితంలోని కష్టసుఖాలకీ, ఉద్యమాలకీ దూరంగా ఎన్నడూ నిలబడలేదు. స్వదేశీ ఉద్యమంలో దిగి ప్రజానాయకుడుగా పని చేశాడు. తన కవిత్వంతో జాతికళ్ళు తెరిపాడు. "దేశ దేశనందిత కారీ" "జనగణమన అధినాయక జయహే" లాటి జాతీయ గేయాలతో భరతమాత మూర్తిని అందరి హృదయాలలోనూ ప్రతిష్ఠించాడు. జలియన్‌వాలాబాగు కాల్పులకు రగిలిపోయి వైస్రాయికి చరిత్రాత్మకమైన ఉత్తరం రాసి తన సర్ బిరుదును వదులుకున్నాడు. నెహ్రూకు రాత్‌బోను రాసిన బహింగ లేఖకి ప్రచండమైన సమాధానమిచ్చాడు. బ్రిటిషు పరిపాలన విషమ ఫలితాలన్నీ బహిరంగంగా పేర్కొని నిరసించాడు. చివరిపుట్టిన రోజున 'సభ్యతలో సంకటం' అనే ఉపన్యాసంలో ఆధునిక నాగరికత పతనానికి కారణాలు నిరూపించి భావి సభ్యతను భారతదేశమే ప్రపంచానికి ప్రసాదించగలదని జోస్యం చెప్పాడు. ప్రజా జీవితంతో సన్నిహిత బాంధవ్యం కలిగిన జాతీయకవి రవీంద్రుడొక్కడే. దేశీయులకి జాతీయ విద్యను ప్రసాదించాలనే కోరికతో శాంతినికేతనాన్ని స్థాపించాడు. జాతి ఆశలనీ, ఆశయాలనీ, కష్టసుఖాలనీ తన కవిత్వంలో ప్రతిధ్వనించాడు. అడుగనపడి అణగారిపోతున్న దీనుల మూగవేదనకు రవీంద్రుని కవిత్వంభాషనిచ్చింది.

జాతీయ కవిగా దేశీయుల హృదయాలను చూరగొన్న రవీంద్రుడు నోబుల్ బహు

మతిని పొందగానే విశ్వకవు లలో ఒకడుగా ప్రపంచ దృష్టిని ఆకర్షించగలిగాడు. ఆయన కవిత్వంలో వున్న విశ్వజనీనమైన లక్షణాలు గుర్తించి నోబుల్ బహుమతినిచ్చి పాశ్చాత్యులు గౌరవించారు. ఈ లక్షణాలు విదేశీయులు మెచ్చుకున్న తరవాతనే స్వదేశీయులు గౌరవించటం మొదలుపెట్టారు.

విశ్వకవు లందరిలోనూ ఒక ముఖ్యలక్షణం సాధారణంగాగోచరిస్తుంది. వారికొక నిర్దిష్టమైన గమ్యముంటుంది. ఆ లక్ష్యం వైపుకు తామునడవటమేకాకుండా ఇతరులను కూడా తోడ్కొని పోగల శక్తి వారికున్నది. రవీంద్రుని లక్ష్యం ఆనందం. జీవితంలోని రకరకాల అనుభవాలనీ సమన్వయించగల తాత్వికదృష్టి ఆయన సాధన. దీనినే "Creative unity" అన్నారు. ఈ సాధన వల్లనే కవి దుఃఖభాజనమైన జగత్తులో ఇతరుల కెవరికీ కనబడని ఆనందాన్ని ఆశనీ చూడగలుగుతాడు. ఈ దర్శనమే "Poets religion" ఈ దృష్టి "గీతాంజలి"లో "గార్డినర్"లో అంతటా మిరుమిట్లు గొలుపుతుంది. ఈ సమన్వయంవల్ల వివిధ జాతుల విజ్ఞానాన్నీ, సంస్కృతినీ, సభ్యతనీ మేళవించి విశ్వమానవ కుటుంబాన్ని అఖండ ప్రపంచాన్ని స్థాపించాలనే కోరికతో రవీంద్రుడు విశ్వభారతిని నెలకొల్పాడు. సమస్త ప్రపంచమూ ఒకేచోట ఒక గూటిలోని పిట్టల్లాగా, సామరస్యంతో నివసించాలని ఆయన సందేశం. జాతీయత, జాతిభేదం అనే సంకుచిత తత్వాలతో ముక్కలైపోకుండా మానవులంతా ఒక్క కుటుంబంగా నిలబడగల అఖండ ప్రపంచసృష్టినే లక్ష్యంగా స్వీకరించాడు. జనగుణమన అధినాయకుని ఆశీస్సులతో, సమన్వయ దృష్టితో, చేరగలమనే ఆశతో మైత్రీభావంతో, అన్నిజాతులూ ఈ లక్ష్యం చేరుకోవాలని రవీంద్రుడు శంఖారావం చేశాడు. ఇది విశ్వకవిగా రవీంద్రుని అద్భుత సందేశం.

జీవితంలోని అన్ని అనుభవాలకీ, అన్ని రసాలకీ రవీంద్రులు తనకవిత్వంలో స్థానమిచ్చి సమన్వయించారు. ప్రణయం, విరహం, సమాగమం, హాస్యం, శాంతం,

కరుణా, దుఃఖం, ధైర్యం ఇవన్నీ రవీంద్రుని కవనంలో, నవలల్లో నాటకాలలో, కథలలో, వ్యాసాలలో ప్రసంగాలలో అంతటా కన బడేవస్తువులు. జీవితానికి భయపడి దూరంగా పారిపోరాదు. జీవితం లోని ప్రతి అనుభవాన్నీ ఆహ్వానించి స్వీకరించాలి. ఈ వివిధానుభవాలను సమన్వయించుకోటం లోనే దుఃఖంలో ఆనందం, కురూపంలో సౌందర్యం, అశాంతిలో శాంతి దర్శించగలుగుతాం. శాంతం, శివం, సుందరం ఇవి జీవన దేవతయొక్క మూడు స్వరూపాలు. ఇవి అంతరతమ సత్యం యొక్క ఆవిర్భావాలు. ఇది విశ్వకవి రవీంద్రుడు అందరి హృదయాలలోనూ మారుమోగించే ప్రబోధం.

ఇంతేకాదు. విశ్వకవులకు వుండవలసిన అతి ముఖ్యలక్షణం ప్రగతి. ఈలక్షణానికి రవీంద్రుడే ఉదాహరణం. కాలంతోపాటు ముందడుగు వేశాడు. ఆయన ఎనభయ్యేళ్ళ జీవితంలో మెరుపుల్లాగా ఎన్నో కొత్త కొత్త మార్పులు వచ్చినయ్. వీటిని చూసి బెదిరిపోలేదు. విస్తుపోలేదు. రానున్న కాలంకంటె గతకాలమే మేలు అని విలపించలేదు. కాల గతితో కదలిపోవటం, ముందు ముందుకి సాగిపోవటం విశ్వకవి రవీంద్రుని విశిష్టత. యువజనుల మీద కొండంతఆశ. పురోగాములైన వీరి త్యాగాలవల్ల, వీరి కృషి వల్ల ఆదర్శ ప్రపంచం నిర్మింప బడగలదని ఆయన విశ్వాసం. అందుకే ఆయన ఎన్నడూ వెనక బడకుండా ప్రచండమైన కాల గతితోపాటు ముందుకు నడిచాడు.

ఈప్రగతి రవీంద్రుని కవిత్వానికి అంతర్వాహిని. ఎప్పుడూ కొత్తదనం కోసం తహతహ పడటం ఈ వృద్ధకవిలోని నిత్య యౌవనానికి లక్షణం. అతి ఆధునికులను కూడా ఆశ్చర్యంలో ముంచగల 'తీన్ సంగీ' అనే నవలని చివరి రోజుల్లో రాశాడు. ఏకొత్తపోకడ బయలుదేరినా తన కవిత్వంలో దాన్ని మెరిపిస్తేకాని తృప్తిపడేవాడు కాడు.

రవీంద్రుని ప్రగతికి రెండు లక్షణా లున్నయ్ – విప్లవం నిర్మాణం. వచనంలో, కవనంలో సంగీతంలో, నృత్యకళలో, చిత్రకళలో రవీంద్రుడు బూజుపట్టిన

పాత నిబంధనలతో పంకెతులతో ఎడతెగని యుద్ధంచేశాడు. అభివృద్ధిని నిరోధించే అర్థంలేని సంప్రదాయాలన్నిటినీ ధ్వంసం చేశాడు. అంతటితో తృప్తిపడలేదు. తన ప్రతిభని ప్రసరించి భాషలోనూ, ఛందస్సులోనూ, కళల్లోనూ కొత్తజవాన్ని వికసింపజేశాడు. వంగభాషలో రవీంద్రుడు ముందడుగువేసి సాధించిన విజయం అన్ని భాషలకీ ఆదర్శప్రాయమైనది.

రవీంద్రుడు 1930లో రష్యాలో సంచారంచేశాడు. అప్పుడు భారతదేశం ఆర్థికదుస్థితిలో అణగిపోయి హాహాకారాలు చేస్తోంది. ప్రపంచంలో ఫాసిజం బయలుదేరి శాంతినీ, స్వాతంత్ర్యాన్నీ మింగివేయటానికి నోరు తెరచింది. ఎక్కడ చూచినా ప్రజలు పడరాని అగచాట్లు పడుతున్నారు. ఇంతకాలమూ మానవుని భావిని గురించి కవి కన్న కలలన్నీ కల్లలై పోయే పరిస్థితివచ్చింది. ప్రపంచంలో మానవునికి అధఃపతనమేకాని అభ్యుదయమార్గం లేదా అనేప్రశ్న కవి హృదయాన్ని వేధిస్తోంది. ఇటువంటిస్థితిలో రష్యాసంచారం. నా స్వప్నాలన్నీ ఇక్కడ ఫలప్రదమైనయ్ అని కవి పొంగిపోయాడు. 1931లో రష్యాలేఖలు ప్రచురించాడు. ఈలేఖలు 70 ఏళ్ల నాటిన కవి రాశాడనటంకంటె రవీంద్రుని ప్రగతికి వేరే నిదర్శనం అక్కర్లేదు.

ఆనాటినుంచీ లోకాన్ని వీడేవరకూ రవీంద్రుడు సృష్టించిన సాహిత్యం అపూర్వమైనది. ఈపది సంవత్సరాలరచనల్లో మునుపు కనబడని చారిత్రకదృష్టి, సామాజికదృష్టి గోచరిస్తుంది. వస్తువులో కొత్తదనం. పదాలూ, మేఘాలూ, వీణా గీతాంజలి నాటివస్తువులు. ఇప్పుడు మిల్లుకూలీ, రిక్షావాలా, నవయువతి, పల్లెపడుచు, విద్యార్థి, గుమాస్తాలతో నిండిన యథార్థదృశ్యాలు రచనలలో కనిపిస్తయ్. కవిలో ఈదృక్పథం విశాలమై పరిపక్వమై 1940 నాటికి "నవజాతక్" అనేగొప్పకావ్యాన్ని సృష్టించింది. చరిత్రలో మునిగి ఒకకొత్తసత్యం కోసం అన్వేషించటం కవి ఆరంభించాడు. రవీంద్రుని రచనలలోనే కాదు, భారతీయ సాహిత్యంలో కూడా "నవజాతక్" ఒక కొత్త శకానికి నాంది. అన్ని సంకెలలూ

విదిలించి, సమాజంలో ఎగుడు దిగుడులు రూపుమాపి స్వాతంత్ర్య సమభావం, శాంతీ మొదలైన పవిత్రాదర్శాలతో జీవించగల మానవులకోసం కవి ఎదురు చూశాడు. ఈ ఆదర్శాల పునాదుల మీద నిర్మించిన నవ్యజగత్తుకోసం, నవ్య సభ్యతకోసం విశ్వకవి పరితపించాడు. ఈ నవజగత్తు అవతరణం కోసమే చివరిపదిసంవత్సరాల రచనలనూ అంకితంచేశాడు. మానవ హృదయంమీద అచంచలమైన విశ్వాసంతో ఆదర్శసభ్యత ఆసియాలోనే ఉదయించ గలదన్న నిశ్చయంతో రవీంద్రుడు లోకానికి వీడ్కోలు చెప్పాడు. వంగ కవిగా జీవితమారంభించిన రవీంద్రుడు విశ్వకవిగా ఎనభయ్యేక టవపట తమఅద్భుత జీవిత కావ్యాన్ని మృత్యువుమీద పద్యంతో సమాప్తం చేశారు.

ఇది రవీంద్రుని ఎనభైసంవత్సరాలపరిణామం. దూరాన వున్న లక్ష్యంవైపుకు ఎడతెగని ప్రయాణం. విశ్వసాహిత్యంలో మరువరాని ఆశ్వాసం.


స్వాతంత్ర్యోదయం

విద్వాన్, వెల్లంకి బ్రహ్మయ్యచౌదరి

***

పుణ్యభారతభూమి నుదయించినాడు
స్వాతంత్ర్యభానుడే చనుదెంచినాడు
స్వాతంత్ర్య కాంతులను ప్రసరించినాడు
దాస్యాంధకారంబు సడలించినాడు
ధర్మచక్రము బూని ధగధగా మెరసి
ఓ భారతీయుడా – ఓ వీరసోదరా
లేచి రావయ్యా – జేజేలు పాడుదము
లేచి రావయ్యా!

శారదచంద్రికా మధుర సంపదలన్, జనయిత్రి భాగ్యధుర్యమున్
గూరిచి, మల్లికా మసృణ కోరకపంక్తులలో సవిత్రి సు
స్మేర రుచిప్రసక్తులు రచించి, మదీయ హృదంతరమ్మునన్
భారతమాతృదేవి పద పంకజముల్ స్మరియింతు నిచ్చలున్.

టాగూర్  రచనలు

పిలుపు

ఆ మహాజ్యోతి సంపర్క స్వార్థమేమొ,
పాంథజనమెల్ల వెఱ్ఱిగా పరుగులెత్తు!
వెనుకబడిపోతి నే నొక్కఁడనె సఖుండ,
ఈ శ్రమాబంధ ముక్తు గావింప రమ్ము.

హృదయ నిష్యంద నైవేద్య సుఫలతోడ
శరధి కడ కేగు నున్మత్త కెరట మట్లు
లీ మహాభార ముక్తు గావింప రమ్ము.

నేను నీ వాడ నెప్పలీ! నీవు నాదు
జన్మ జన్మల స్నేహరసప్రతిమవు,
మన్మనోమందిరాంతర మంటపమున
నిలచి, చిఱునవ్వు సుధ జల్లు వెలుగు వీవు!

రమ్ము, సామాన్య జనసమూహమ్మునుండి
యీ శ్రమా బంధముక్త గావింప రమ్ము!!

కవీ!

సిద్ధయౌవన పట్టాభిషేక వేళ,
ప్రేమ హర్మ్యాంగణ స్వర్గ ధామమందు,
హృదయసఖి పజ్జ గొలువ, కవీంద్ర ; నీవు
రత్న సింహాసన మ్మెక్కి ప్రబలినావు.

పచ్చ జలతారు పరదాలు పఱచె నపుడు
నీవు నడతెంచు త్రోవ క్షోణీలలామ;
పొడుపు కెంజాయ జిలుగు మేల్ముసుగు దాల్చి
పసిడి గొడుగెత్తి పట్టె నంబరతలమ్ము ;
దివ్య మధుపూర్ణ రమ్య పాత్రికలు బూని
కలసి నర్తించె ఋతుకన్యకా జనమ్ము ;
స్వర్ణ ప్రాసాద గాఢ నిస్తబ్ధ సీమ,
లోక బాధా విషాద విలుప్తమైన
విశ్వమానంద కందమై విరిసె నీకు !

అక్కటా ! యింతలోన దైవానుశాప
ఝుళిత ఘోర వియోగ గర్జామహాగ్ని,
యౌవనాహంకృతి విదగ్ధ మయ్యె బొమ్మ !
వలపు టొంటిపాటు ముసుంగు తొలగిచన్న,
భగ్నమైపోయె ఋతులోక వైభవమ్ము ;
మసక చీకట్ల నింగిపై మిసిమి గులుకు
జృంభితాషాఢ వర్ష లక్ష్మీమవి భూతి
దాటి, నీ భగ్న చిత్త వ్యథాస్వరాలు
దూరదూరాల కలలలో చేరబోవు !

[అ ను వా ద ం : జ గ్గ య్య]

వ్రాయడం నేనెలా నేర్చుకున్నాను?

మాక్జిం గోర్కీ

ఒకమనిషి వ్యక్తిగత జీవితచరిత్ర తెలుసుకునేకంటే మానవ శ్రమనూ సాధననూ గూర్చిన చరిత్ర తెలుసుకోడంలో ఎక్కువ అభిరుచీవుంది; ప్రాముఖ్యమూవుంది. తీరా నూరేళ్లూ నిండకుండానే మనుష్యులు చనిపోతారు; కాని వారుచేసినపనిమాత్రం చిరకాలం వుండిపోతుంది. శాస్త్రజ్ఞులు తమప్రత్యేకతను గుర్తించడంమూలంగానే, నేటి శాస్త్రవిజ్ఞానంలో ఇంత అద్భుతమైన ఫలితాలు కలిగాయి; శాస్త్రవిజ్ఞానం త్వరత్వరగా పెరిగింది. శాస్త్రానికీ, సాహిత్యానికీ చాలా సాజాత్యంవుంది. ఈ రెంటిలోనూ– పరిశీలించడం, సరిపోల్చిచూడడం పూర్తిగా అవగాహన చేసుకోడం – వీటికిప్రధానంగా ప్రాముఖ్యంవుంది. శాస్త్రజ్ఞుడికిలాగానే, కళాకారుడికికూడా భావనాస్ఫురణలు కావాలి. ఇంతవరకూ సమన్వయం కుదరని అనేక సూత్రాలకు ఈ భావనాస్ఫురణలే సమన్వయం కలుపుతాయి. ఇలా సమన్వయించుకొని శాస్త్రజ్ఞుడు ఒక సిద్ధాంతానికి వచ్చి, దాన్ని ప్రకృతి పరిశీలనలో ధ్రువపరచుకుంటాడు. అదే క్రమంగా మన ఇచ్ఛాప్రతిఫలను బట్టి మనంతట మనం సృష్టించుకొనే అపరప్రకృతి అయిన సంస్కృతీ రూపం పొందుతుంది.

సాహిత్యరచనలో నేర్పూ, రకరకాల పాత్రలను చిత్రించడంలో నేర్పూ కావాలంటే, తీవ్రపరిశీలనా, సద్యఃస్ఫురణా, తన మనస్సులోనే అన్నిటినీ కూర్చుకునేశక్తీ కావాలి. తానెరిగిన ఒక దుకాణదారును గానీ, ఒక ఉద్యోగస్థుణ్ణిగానీ, ఒకపనివాణ్ణిగానీ రచయితపరిశీస్తున్నాడంటే ఇంచుమించుగా ఒకానొక వ్యక్తియొక్క పోలికలుచిత్రిస్తున్నాడన్నమాట. కాని ఈపోలికమాత్రమే అయితే ఇది కేవలం ఫోటో తీయడమే అవుతుంది. దీనివల్ల సాంఘిక ప్రబోధం ఏమీ వుండదు. ఇది మానవజీవితాన్నిగూర్చి మనకున్న జ్ఞానాన్ని యేవిధంగానూ పెంచదు.

కాని రచయిత ఒక వందమంది దుకాణదార్లనూ, ఉద్యోగస్తులనూ, పనివాళ్లనూ పరిశీలించి. వాళ్ల వాళ్ల ప్రత్యేక పోకడలూ, అలవాట్లూ, అభిరుచులూ, ఊహలూ, నమ్మకాలూ, వాళ్ల వాళ్ల వర్గాలకు చెందిన విశిష్టలక్షణాలూ గమనించి, వీటన్నిటినీ ఒక్కొక్క దుకాణదారులోను, ఉద్యోగస్థుడిలోను, పనివాడిలోను సజీవంగా తీసుకురాగలిగితే, అతను ఒక ప్రత్యేక పాత్రను సృష్టించిన వాడవుతాడు. అతని రచన కళాదృష్టిలో నిలుస్తుంది. పరిశీలనా జీవితానుభవాలు రచయితకు వాస్తవాలముందు తన వ్యక్తిగత ఇష్టానిష్టాలను అధిగమించే శక్తి నిస్తాయి. వ్యక్తిగతంగా అయితే బాల్జాక్‌కు బూర్జువా విధానం మీదే అభిమానం. కాని బాల్జాక్ తన నవలల్లో బూర్జువా వర్గపు సంకుచితత్వాన్నీ, నైచ్యాన్నీ నిరంతరం బలంగాను స్పష్టంగాను బట్టబయలు చేసాడు. ఇలా, తన వర్గాన్నీ కాలాన్నీ అధిగమించి, నిష్పక్షపాతులైన చరిత్రకారుల్లాగ ప్రవర్తించిన రచయితల నెందరినైనా చూపవచ్చు. కాని ఇక్కడ ఏ యే జీవులు ఏ ఏ పరిస్థితుల్లో

జీవించేదీ, ఏ ఏ ఆహారం అవసరమైనదీ అర్థం చేసుకొని, ఏ యే జీవులు పెంపొందడానికి గానీ నశించడానికిగానీ కారణాలు వివరిస్తూ నిరంతర జీవిత పోరాటాన్ని చిత్రించే శాస్త్రజ్ఞుడి రచనకు — రచయిత రచన ఏ మాత్రం తీసిపోదు.

జీవిత పోరాటంలో స్వార్థాన్ని కాపాడుకునే స్వభావంనుంచి మానవుడిలో విజ్ఞానం, భావన అనే రెండు మహత్తరమైన నిర్మాణ శక్తులు పెంపొందాయి. ప్రకృతినీ సాంఘిక జీవితాన్నీ పరిశీలించి, పరిపోల్చి చూచుకొని, స్పష్టీకరించే సమర్థతే విజ్ఞానం; ఇంకా తేలికగా చెప్పాలంటే, ఆలోచించే శక్తే విజ్ఞానం. స్థూలంగా చూస్తే, భావనకూడా ఆలోచనే. భావన అంటే ప్రపంచాన్ని గురించి ఆలోచించడమే కాని అది దేన్నో ప్రతిబింబిస్తున్నట్లు కళాదృష్టిలో ఆలోచించడం. మానవ స్వభావాలూ భావాలూ ఉద్దేశాలూ ఇతరవస్తువులోను ప్రకృతితత్వంలోను ఆరోపించగల శక్తే భావన అని చెప్పవచ్చు.

'గాలి ఏడవడం', 'చంద్రుడు దీనంగా పాలిపోవడం', 'నదీ తరంగాలు వీరగాధలు గానంచేయడం', 'మహారణ్యాలు శోకభీకరాలు కావడం', 'నదులు పర్వతాలను పెకలించాలని చూడడం', 'పర్వతాలు నదీవేగానికి ఊగిసలాడికూడా నిలదొక్కుకోవడం' ఇలాంటివి మనం వింటున్నాం.

ఇలా ప్రతిదాంట్లోనూ మానవ మనస్తత్వ ప్రతిబింబాన్నే చూడడంవల్ల, మనకు ప్రకృతి తత్వం తేలికగా అర్థమవుతుంది. ఇక్కడ మానవుడు తన కగుపించే ప్రతి వస్తువులోను తన స్వభావాన్నే ఆరోపించడం కనిపిస్తుంది. తాను చూసే ప్రతి వస్తువులోను మానవుడు తన గుణాలనే చూస్తాడు; అదే ప్రతివస్తువులోను ఆరోపిస్తాడు. తనకష్టంతోటి తెలివితేటలతోటి నిర్మించుకున్న ప్రతి వస్తువులోను, సహజమైన సమస్త ప్రకృతిలోను కూడా, ఇలా తన గుణాలనే మానవుడు దర్శిస్తాడు. ఇలాంటి మానవ ప్రతిబింబ దర్శనం ప్రమాదకరమనీ, దీనికి సాహిత్యంలో చోటు లేదనీ కొందరి మతం; కాని వాళ్ళే 'చలి కరుస్తున్న' దంటారు, 'సూర్యుడు నవ్వా' డనీ, 'వసంతం వచ్చిం' దనీ 'వాన సాగిం' దనీ అంటారు.

సాహిత్యంలో వాస్తవిక కవిత్వమూ, భావకవిత్వమూ అని రెండు ప్రధానశాఖలున్నాయి. ప్రజలనూ ప్రజల జీవిత పరిస్థితులను యథార్థంగా, ఏరంగూ వేయకుండా చిత్రించడమే వాస్తవికత. ఇక భావకవిత్వాన్ని గూర్చి అనేక నిర్వచనాలు వచ్చాయి కాని, సాహితీవేత్తలందరూ ఒప్పుకొన్న ఖచితమైన! పూర్తిగా సంతృప్తికరమైన నిర్వచనంమాత్రం ఇంతవరకు ఒక్కటీ లేదు. అయితే ఈభావ కవిత్వంలో రెండు పరస్పర విరుద్ధధోరణులు కనిపిస్తాయి. ఇందులో ఒకటి — రంగుపూసి వాస్తవాన్ని మరుగుపరచి ప్రజల్ని సంతృప్తి పరచడానికి ప్రయత్నిస్తుంది; లేదా, భయంకర జీవితాన్ని గురించీ — ప్రేమనుగురించీ — మృత్యువునుగురించీ — కేవలం శాస్త్రపరిశోధనవల్ల దప్పితే, ఏ అదృష్టంవల్లా ఏ ఊహాపోహాలవల్లా పరిష్కారం కానటువంటి అనేక సమస్యలనుగురించీ గానంచేస్తూ, ప్రజల్ని వాస్తవ పరిస్థితులనుంచి మధ్యపరచి, ఆత్మానుభూతులవంకకు మరల్చడానికి ప్రయత్నిస్తుంది, ఇదే నిర్జీవభావ కవిత్వమంటారు. ఇక రెండోది, సజీవభావకవిత్వం — జీవించాలనే మానవుడివాంఛను ఇదిబలపరుస్తుంది.

దోపిడితోను దౌర్జన్యంతోనుకూడిన వాస్తవిక పరిస్థితులను ఎదుర్కొని పోరాడేటందుకు మానవుణ్ని పురికొల్పుతుంది.

బాల్జాక్, టర్జనోవ్, టాల్‌స్టాయి, గొగోల్, లెస్కోవ్, చెకోవ్‌ల రచనలు భావకవిత్వమా? లేక వాస్తవిక కవిత్వమా? అనేది ఖచ్చితంగా తేల్చడం కష్టం. గొప్ప రచయితలందరిలోను వాస్తవికతా, భావకవిత్వమూ పెనగొన్నట్లు కనిపిస్తుంది. బాల్జాక్ వాస్తవికవాదే కాని, వాస్తవికతకు చాలాదూరమైన 'లాపేడీ షాగ్రిన్' అనే నవలకూడా వ్రాశాడు. అలాగే గొగోల్ నుంచీ చెకోవ్ బతికినదాకా ప్రతిగొప్పరచయితా వ్రాశారు. టర్జనోవ్ రచనల్లోనూ భావకవిత్వం కనిపిస్తుంది. ఈ వాస్తవిక భావకవిత్వాల మేళికలయిక మనప్రముఖ రచయితలందరియొక్క ప్రత్యేక లక్షణం. ప్రపంచసాహిత్యంమీద తనమహత్తరప్రభావాన్ని విరజిమ్మిన మనసాహిత్యానికి ఆ ప్రతిభాశక్తులనుఈ మేళికలయికే ప్రసాదిస్తున్నది. "వ్రాయాల నేకోరిక ఎందుకుకలుగుతుంది?" అనేప్రశ్ననుగూర్చి మీరుఆలోచిస్తే, భావకవిత్వానికీ వాస్తవికతకూ ఉండే సంబంధం మీకు బోధపడుతుంది. దీనికిరెండే జవాబులున్నాయి. ఇందులో ఒకటి—నాకో పదిహేనేళ్ల కార్మికబాలిక వ్రాసినలేఖలో నుంచి ఉదహరిస్తాను.

"నాకు ఇప్పుడు పదిహేనేళ్ళే. కాని ఈచిన్నవయసులోనే నాకు వ్రాసేసుకృతం ఉన్నట్లు కనిపిస్తున్నది. దారిద్ర్యంలో చిక్కుకొని దుఃఖభాజనమైన నా జీవితమే ఇందుకు కారణం" అని ఆమె వ్రాసింది.

ఆమె నిరుపేదజీవితం ఆమెభావనాశక్తి చేత అలంకృతం అయ్యేందుకుగాను, ఆ 'వ్రాసేసుకృతం' అనడానికిబదులు, 'వ్రాయాల నేకోరిక' అంతేఎక్కువ ఖచితంగా వుంటుందని నేనంటాను. ఇక్కడ ఇంకో చిన్న ప్రశ్నవస్తుంది—"దరిద్రజీవితం అనుభవిస్తున్నమనిషి వ్రాయ గలిగిందేమిటి?" అని.

ఈ ప్రశ్నకు వోల్గాతీరంలోను, యూరల్స్‌లోను, సైబీరియాలోను ఉన్నఅల్పసంఖ్యాకజాతులవారు జవాబు చెప్పారు నిన్న మొన్నటిదాకా ఈ జాతులవారికి 'లిపి' అంటూఏదీ లేదు. కాని పదిపన్నెండు వందలేండ్లలో తీరాఈనాటికి, ఘోరారణ్యాల్లోను, నదీతీరాల్లోను, తూర్పునపచ్చికమైదానాల్లోను ఉత్తరపు మంచు నేలల్లోనూ అనుభవించినదుఃఖమయదరిద్రజీవితాన్ని పాటలతోనుఅద్భుతమైన కథలతోను, వీరగీతాలతోను, దైవసంబంధమైన పురాణాలతోను అలంకరించుకొన్నారు; తమవాఙ్మయాన్ని పెంపొందించుకొన్నారు. భావనాశక్తితో వారు నిర్మించుకొన్న ఈ పురాణాదులు 'మతకీయ'మైనవని చెబుతారు; కాని, సారాంశానికి వస్తే అవికూడా ఉత్తమకళా సృష్టిఅనే చెప్పాలి.

నేను ఆశిస్తున్నట్లు—నాకు ఉత్తరం వ్రాసిన ఆ కార్మిక బాలికకు 'వ్రాసే సుకృతం' నిజంగావుంటే, ఆమె తనదుఃఖమయ దరిద్రజీవితాన్ని అలంకృతం చేయడానికి పూనుకొని, అలాంటి అద్భుత రచనలు చేయవచ్చు; నిజానికి ఇవాళ మనప్రజలున్న స్థితికంటే వాటిని ఉత్తమంగా కూడా చిత్రించవచ్చు. "ఇవాన్ ఇవనోవిచ్, ఇవాన్ నికిఫరోవిచ్‌తో ఎలాపోట్లాడాడు" "పాతలోకపు పెదమనుషులు," "చచ్చిన ఆత్మలు" అన్నపుస్తకాలువ్రాసిన గొగోల్ "తారాస్ బల్బా" కూడావ్రాసాడు ఇందులో మొదటి మూడు పుస్తకాల్లోను

గోగేల్ 'చచ్చిన ఆత్మలతో' ఉన్న ప్రజల్ని చిత్రించాడు. ప్రజలు నిజంగా అలాగే జీవించారు; ఈనాటికీ అలాగే జీవిస్తున్నారు. ఇది కఠోరమైన సత్యం. వారిని చిత్రించడంలో గోగేల్ వాస్తవికతనే ప్రదర్శించాడు.

కాని, జెపోరజ్ కోసక్కులు దైవభీతి గల ప్రభువులనీ, తమ చేతికర్ర కొసమీద మనుష్యుల్ని ఎత్తి వేయగల భీమబలాఢ్యులనీ గోగేల్ 'తారాస్‌బల్బా'లో చిత్రించాడు. కాని ఆ చేతికర్ర విరిగిపోవలసిందే గాని, ఎప్పుడూ మనిషిని ఎత్తివేయలేదు అదేకాక. అసలు జెపోరజ్ కోసక్కులంటూ ఎవ్వరూ ఎప్పుడూ లేరు. నిజానికి గోగేల్ వ్రాసిన యీ కథ ఒక చక్కని అబద్ధం. ఈ కథలోను ఇంకా ఇలాంటి అనేక కథల్లోను గోగేల్ భావకవిత్వమే వ్రాశాడు. 'చచ్చిన ఆత్మలతో' వున్న ప్రజల దుఃఖమయ దరిద్రజీవితాన్ని చూసి చూసి, వేసారిపోవడమే దీనికి కారణమయి వుంటుంది.

కాని, ఈ నే చెప్పేదానికంతటికీ సాహిత్యంలో భావకవిత్వం తప్పనిసరి అనే అర్థం వస్తుందా? అంటే నిశ్చయంగా వస్తుంది. అయితే, ఈ భావకవిత్వానికి మనమొక ప్రధానమైన కొత్త కూర్పు చేస్తాం.

మరో డెబ్భైఏళ్ల కార్మికుడు నాకు ఏం వ్రాశాడో చూడండి—

"నేను వ్రాయకుండా దాచుకోలేని అనేక విషయాలు నాలో వున్నాయి"

ఇక్కడ వ్రాయాలనే కోరిక జీవితంలోని దారిద్ర్యంనుంచి కాక, జీవితంయొక్క సంపన్నత మీదనే, ఎవరికో ఏదోఒకటి చెప్పాలనిపించే భావాధిక్యం మీదనే ఆధారపడుతున్నది. నాకు వ్రాసేవాళ్లల్లో చాలామంది, తాము చెప్పుకోవలసింది ఎంతో వుందనీ తమ అనుభూతుల్ని తాము చెప్పకుండా ఉండలేమనీ వ్రాస్తున్నారు. బహుశః వీరిలోనుంచి చాలామంది వాస్తవిక రచయితలు వస్తారు. కాని వారి వాస్తవికత కొంత భావకవిత్వపు కలగలపు లేకుండా వుండదని నేననుకుంటాను. ఇది తప్పనిసరే గాక, నేటిలాగ వైజ్ఞానికంగా అభ్యుదయం చెందుతున్న ఏయుగంలోనయినా ఇది సమర్థనీయం కూడా.

ఇక నేనెందుకు రచన ప్రారంభించానో చెబుతాను. దుఃఖమయ దరిద్రజీవితం, నామీద తెచ్చిన ఒత్తిడివల్ల, వ్రాయకుండా దాచుకోలేని అనేక భావాలు నాలో ఉండడంవల్ల నేను రచన ప్రారంభించాను. ఇందులో మొదటిది దుఃఖమయ దరిద్ర జీవితంలోకి, ఉన్నత భావనా సంపదను ప్రవేశ పెట్టేందుకు నన్ను ప్రేరేపించింది: రెండోది వాస్తవిక స్వభావంగల కథలు వ్రాయడానికి పురికొల్పింది.

ఇదంతా చూస్తే, ఇంతవరకూ మనసాహిత్యంలో, వాస్తవికతను నిర్మాణ దృష్టితో ప్రదర్శించేదీ మానవ శ్రమను జీవించాలనే వాంఛను ప్రకటించేదీ, నూతన జీవితవిధానాలు నిర్మించుకోవాలని ప్రబోధించేదీ, ఇంత కష్టంతో ఇన్ని త్యాగాలతో మనం ఈనాటికి బయటపడుతున్న ఆపాతసమాజం మీద ద్వేషాన్ని పురికొల్పేది అయిన భావకవిత్వం లేదనేచెప్పాలి.

నా చిన్నతనంలో నేను జీవితాన్ని గురించి అసహ్యించుకున్నట్లు నాకు గుర్తులేదు. కాని నా చుట్టూ ఉండే మనుష్యులు జీవితాన్ని అసహ్యించుకుంటున్నట్లు మాట్లాడడం నేనెరుగుదును. కాని అలా మాట్లాడడంలో ఇతరులకు సహాయం చేయడానికి తమకున్న ఇష్టంలేనితనాన్ని దాచు

కోవాలనే ఎత్తు తప్పితే మరేమీ లేదు. అందువల్లనే నేను వారిని అనుకరించకుండా వుండడానికి తీవ్రంగా కృషిచేశాను. కాని తర్వాత తర్వాత అలా మాట్లాడేవాళ్ళు బొత్తిగా ప్రతిఘటనాశక్తి లేనివాళ్ళనీ, పని చెయ్యనివాళ్ళుగానీ చెయ్యలేనివాళ్ళుగానీ అనీ, ఇతరుల కష్టంమీద సుఖజీవితం గడపాలనే కోరికగల వాళ్ళనీ నేను తెల్సుకున్నాను.

జీవితమంటే ఉండే భయాన్ని గూర్చిన అనుభవం నాకు కావలసినంత వుంది. ఇదంతా పట్టి గుడ్డిభయమని ఇప్పుడంటాను. అతి దౌర్భాగ్య పరిస్థితుల్లో జీవించడంవల్ల ప్రజల్లో వున్న అర్థంకానటువంటి దుష్ట స్వభావమూ, నిష్కారణమైన క్రౌర్యమూ నేను అనుభవించాను. కొంతమందిమీద మోయలేని బరువూ, కొంతమందికి సంపదా ఇది చూసి నేను ఎంతో ఆశ్చర్యపడ్డాను. మతాధిపతులు తామే దేవుళ్ళమనుకొంటూ తమకోసం పనిచేసేవారినుంచి ఎలాంటి దారుణమైన కోరికలు కోరేవారో నా చిన్నతనంలోనే నేను చూశాను. ఒక్క మాటలో చెప్పాలంటే అట్టడుగున అణగారిపోయిన నీచమైన జీవితాన్ని మీకంటే నే నెక్కువగా పరిశీలించాను. తాను ఏ స్వభావానికి అలవడ్డాడో అలా జీవించేహక్కు ఇంక వుంటుందనే నమ్మకం లేక, విప్లవమంటే హడలుపుట్టివున్న మధ్యతరగతి జీవితాన్ని మాత్రమే ఇవాళ మీరు చూస్తున్నారు. కాని తాను మంచిజీవితమే గడుపుతున్నానని అలాంటి వుత్తమమైన నిశ్చలమైన జీవితం స్థిరంగా స్థాపితమై పోయిందనీ నమ్ముతూండిన మధ్యతరగతి జీవితాన్ని నేను చూశాను. అంటే, ఇంకా ఎంతో అసహ్యకరమైన పరిస్థితుల్లో వున్న జీవితాన్నే చూశానన్నమాట.

ఆరోజుల్లో నేను డికెన్స్, బాల్జాక్, అయిన్స్వర్త్, బల్వర్ లిట్టన్, డ్యూమాస్ మొదలైనవారి గ్రంథాలు చదువుతూండేవాణ్ని. బలవత్తరమైన అభిప్రాయాలూ, విశిష్ట స్వభావాలూ, కొత్తరకం సుఖదుఃఖానుభూతులూ కలిగి, బలమైన అభిప్రాయ భేదాలతో పోరాడుకొనే మనుష్యులను గురించి ఈనవలలే నాకు పరిచయంచేశాయి. అంతకుపూర్వం, అమిత పేరాసతోను అసూయతోను క్రోధంతోను తమ అల్పమైన జీవితాలు జీవిస్తున్న సంకుచిత మనస్కులైన స్త్రీపురుషులు మాత్రమే నాచుట్టూ కనుపించారు. తమపొరుగింటివాళ్ళబ్బాయి రాయి వేసి తమకోడిపెట్ట కాలు విరగగొట్టాడనో, లేక కిటికీ అద్దంపగలగొట్టాడనో – పోట్లాడుకొనేవాళ్ళు. రొట్టెమాడినాసరే, మాంసం మగ్గినాసరే, పాలు కాటుపోయినా సరే వాళ్ళు అంతలో ఆగ్రహంవచ్చి శివాలువేసేవాళ్ళు. అంతలో దుఃఖపడేవాళ్ళు. పంచదారకో గుడ్డముక్కకో ఒక దమ్మిడీధర పెరిగిందంటే, దానిమీదవాళ్ళు గంటలతరబడి ఏడ్చేవాళ్ళు. వాళ్ళపొరుగువాళ్ళు ఏవన్నా కష్టాలువస్తే, వాళ్ళు నిజంగా ఆనందపడేవాళ్ళు. పట్టిఊరడింపుమాటల్లో వాళ్ళ ఆనందాన్ని కప్పిపుచ్చుకునేవాళ్ళు. మధ్యతరగతి జీవితాకాశంలో రూపాయే సూర్యుడు; ఆరూపాయే ఈప్రజల్లో నీచాతినీచమైన తగాదాలకు మూలం. ఈసంగతి నేను స్పష్టంగా చూశాను. ఏపండుగవచ్చినా ఏపబ్బంవచ్చినా గొంతుదాకా తిని, డోకు పుట్టేదాకా తెగతాగి తందనాలాడడమే జీవితం. ఇలాంటిప్రజలమధ్యనే నేను నా జీవితం ప్రారంభించాను. కొన్ని సమయాల్లో

ఈ అసహ్యమైన జీవితాన్ని చూస్తే విసుగు పుట్టి, మనస్సు చెదరిపోయి, నిద్రపోదామనిపించేది; కాని, కొన్ని సమయాల్లో ఏదో ఒక ఆత్మశక్తితో పైకి లేద్దామనే కోరిక పుట్టేది.

ఈ విసుగూ ఆశా రెండూ కలిసి కొన్ని పిచ్చి పిచ్చి సాహసాలకు దారితీశాయి. రాత్రిళ్ళు ఇళ్ళమీద కెక్కి పొగగొట్టాల నిండా మన్నోసి పాత గుడ్డలో కుక్కి వచ్చేవాణ్ణి, పొయ్యిమీద కాగుతున్న పులుసులో పటేడు ఉప్పుపోసేవాణ్ణి. కాగితపు గరాటుతో గడియారంలో దుమ్ము పోసేవాణ్ణి. ఇప్పుడు కూడా పనులని చెప్పేవి అప్పుడు నేననేకం చేసాను. నేనేదో జీవించి ఉన్నట్టు నాకు అనిపించడానికి ఇవన్నీ చేసాను. ఇంతకంటే నేను జీవించి ఉన్నట్లు అనుకోడానికి నాకు గత్యంతరమేమీ కన్పించింది కాదు. నేనేదో ఒక పెద్ద కీకారణ్యంలో దారితప్పినట్లు అనిపించేది; గొంతుపరకు ఏదో బాడిలో పూడుకు పోయినట్లు అనిపించేది.

నాకొక సంఘటన జ్ఞాపకం వుంది. ఒకనాడు పోలీసులు కొంతమంది ఖైదీలను పట్టుకుని మావీధిన పోతున్నారు. వాళ్ళను సైబీరియా పంపడానికి స్టీమరు కోసం జైలునుంచి వాల్తేరుకు తీసుకొస్తున్నారు. వాళ్ళను చూస్తే నాలో ఏదో ఆవేదన బయలుదేరేది. వాళ్ళంటే నాకు అసూయకూడా కలిగేది. వాళ్ళను పోలీసులు చుట్టుముట్టి వున్నప్పటికీ కొందరికి సంకెళ్ళువేసి వున్నప్పటికీ వాళ్ళు ఎక్కడికో ఒక చోటికిపోతున్నారు. నేను శాశ్వతంగా మారులో ఎలుకలాగా ఈ మురికకూపంలో పడివుండవలసిందేకదా — అనిపించేది. మరోనాడు కొంతమంది నేరస్థులు సంకెళ్ళుగలగలలాడుతూ మావీధిన నడుస్తున్నారు. అందులో ఒక ప్రక్కన పేవుమెంటుకగ్గరగా కాళ్ళకూ చేతులకూ సంకెళ్ళున్న ఇద్దరు ఖైదీలున్నారు. వాళ్ళలో ఒకడు చాలా భారీమనిషి. నల్లటిగడ్డం గుర్రపుకళ్ళు మొఖాన ఎర్రని చీలిక — చీలిపోయిన చెవి భయంకరమైన విగ్రహం. నేను పేవుమెంటుమీద నడుస్తూ అతనివంక చూస్తుండగానే అతను "ఒకేలఅబ్బాయ్, రా, నాతో రా" అని సంతోషంగా కేకవేశాడు. ఈమాట వినేసరికి అతను నన్ను చేయిపట్టుకుని రమ్మన్నట్లు అనిపించింది.

నేను గబగబా అతనిదగ్గరికి పరుగెత్తాను. కాని ఒక పోలీసువాడు నన్ను త్రోసి నెట్టివేశాడు. వాడు నన్ను నెట్టివెయ్యక పోయినట్లయితే నేను అతనితో ఎక్కడికో వెళ్ళిపోయేవుందును. ఎందుకంటే, అతను నేను మామూలుగా ఎరిగిన మనుషుల్లాగా కాక, ఏదో కొత్తగా వున్నాడు. అతను భయంకరంగానే వున్నాడు సంకెళ్ళలోనే వున్నాడు. కాని నన్ను ఒక కొత్త లోకానికి తీసుకెళ్ళగలడు. ఆ మనిషి, ఆ చక్కని గొంతూ నాకు ఎంతో కాలం గుర్తు. ఇలాంటిదే ఇంకో బలమైన సంఘటనతో కలిసి అతని విగ్రహం నా కళ్ళలో మెదిలేది. మొదటిపేజీలు పోయిన ఒక లావాటి పుస్తకం ఎలాగో నాకొకటి దొరికింది. అందులో ఈ క్రింది కథ ఒక్కటి తప్పితే నాకు గుర్తుందేమీ లేదు. ఒక రాజుంటాడు. అతను ఒక రైతును పిలిచి ఓ పెద్ద సామంత పదవి ఇస్తానంటాడు. దానికి రైతు చెప్పిన జవాబు ఇది;

"నన్ను ఇలాగే రైతుగానే
జీవించి చచ్చిపోనీయండి. ఇలాగే
నాతండ్రి జీవించాడు. ఆయన
కొడుకును నేనూ ఇలాగే జీవించాలి.
గొప్పవాళ్ళకంటే కొద్ది వాళ్ళు గొప్ప

పనులు చెయ్యడం ఎక్కువ గౌరవం కదా !"

ఈవాక్యాలు తీసుకొని నా కాపీపుస్తకంలో వ్రాసుకున్నాను. ఇవి మధ్యతరగతి వ్యామోహాల్లో పడిపోకుండా నన్ను కాపాడాయి.

పదేళ్ళతర్వాత ఆవాక్యాలు "జార్జి ఎ - గ్రీన్, ది. పిన్నర్ ఆఫ్ వేక్ ఫీల్డు" అనే * రాబర్ట్ గ్రీన్ వ్రాసినపుస్తకంలోనివని తెలుసుకున్నాను. ఈవిషయం తెలుసుకోగలిగినందుకు నేనెంతో సంతోషించాను. కష్టజీవితంలో సర్వదా సహాయపడే స్నేహితుడులాంటిదైన సాహిత్యం మీద నాఅభిరుచికూడా పెరిగింది.

* రాబర్ట్ గ్రీన్ షేక్స్పియర్ సమకాలికుడు 16వ శతాబ్దంవాడు.

మేముఆరోజుల్లో ఒంటరి తోడేళ్లలా సమాజంపై సవతిబిడ్డలలా వుండేవాళ్లమనే విషయం మీరుగుర్తించుకోవాలి. మీరో, ఈనాడు తమశక్తి తాను తెలుసుకొని, చైతన్యంతో ప్రభుత్వాధికారాన్ని హస్తగతం చేసుకొని వ్యక్తులకృషికి తగినవిలువ కట్టడం నేర్చుకుంటున్న కార్మికవర్గానికి ముద్దుబిడ్డలు! ఇవాళ కార్మికకర్షక రాజ్యమంటే మీశక్తిసామర్ధ్యాలను పూర్తిగా పెంపొందించగల, పెంపొందించవలసిన ప్రభుత్వం వుంది; అది క్రమేణా ఆకర్తవ్యం నిర్వహిస్తున్నది.

సంఘమంతా అజ్ఞానంలోనూ, దౌర్జన్యంలోనూ ఉన్న రోజుల్లో, మఠాధిపతులు కత్తికట్టిన రోజుల్లో, పెట్టుబడిదారుల స్వార్థపరత్వమూ 'కళాభిమానుల' వెలసాలూ కూడుకున్న రోజుల్లో, అత్యంతమైన క్లిష్టపరిస్థితులమధ్య నిజంగా అమూల్యమైనవీ, శాశ్వతోపయోగకరమైనవీ, సుందరమైనవీ అయిన ఈ మానవశాస్త్రాలూ కళలూ వ్యక్తుల చేత నిర్మించబడ్డాయనే, సంగతి మీరు తెలుసుకోవలసిన అవసరం వుంది.

ఈ సంస్కృతి నిర్మాతల్లో పాండో, ఎడిసన్ల లాంటి సాధారణ కార్మికులున్నారన్న, నేతయంత్రాన్ని కనిపెట్టిన ఆర్కురైట్ మంగలివాడనీ; కుమ్మరివాడయిన బెర్నార్డ్ పాలిసే కుండలు చేయడంలో గొప్ప కళానిధి అనీ; అన్నికాలాలకూ గొప్ప నాటకకర్త అయిన షేక్స్పియర్ ఒక మామూలు నటుడనీ; మోలేర్ కూడా అలాంటివాడేననీ మీరు గుర్తించుకోవాలి. ఇలాంటి ఉదాహరణలు పదులు చెప్పవచ్చు.

ఈరోజున మనకున్న విజ్ఞానం పొందే అవకాశాలూ, శాస్త్రీ సౌకర్యాలూ ఏవీ తమ చేతిలో లేకుండాకూడా, కృషిచేసిన వ్యక్తులే ఈ మహత్తర కార్యాల నన్నింటినీ చేశారు! ఇక ఇప్పుడు, అనవసరమైన శ్రమనుంచీ, కొద్దిమందిభాగ్యవంతులనూ, మృత్యురాక్షసి వాతపడే కోటకొలది కార్మికులను సృష్టించే దోపిడీవిధానం నుంచీ ప్రజల్ని విముక్తులను చేయడానికి కంకణం కట్టుకున్న మన దేశంలో మన వైజ్ఞానిక బాధ్యతలు ఎంత సుకరమైనవో ఆలోచించండి.

నేనెలావ్రాయడం నేర్చుకున్నానో ఇప్పుడు చెబుతాను.

జీవితంనుంచీ, పుస్తకాలనుంచీ కూడా నా అభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఇందులో జీవితానుభవం ముడిసరుకుతో పోల్చితే, పుస్తకానుభవం సగం తయారైన వస్తువుతో పోల్చవచ్చును. స్పష్టీకరణకోసం, ఇంకా మోటుగాచెప్పాలంటే, జీవితానుభవం ఒక

ఎండుశవంలాగా కన్పిస్తే, పుస్తకానుభవం పదును చేసిన దాని చర్మంలా కన్పిస్తుంది. నేను చాలాభాగం విదేశ సాహిత్యానికి, అందులో ముఖ్యంగా ఫ్రెంచిసాహిత్యానికి చాలాకృతజ్ఞుణ్ని.

మా తాత చాలాకోపిష్టి, పిసినారి. అయినా, నేను 'ఎజనీగ్రాండెట్' అనే బాల్జాక్ నవల చదువకముందు మా తాతను అంతబాగా అర్థంచేసుకోలేను. అతను తెలివితక్కువవాడని అంతసగధాగా కనిపించడనీ తప్పితే, ఎజనీతండ్రి ఆ ముసలితాత మా తాతలాగానే పిసినిగొట్టూ, కోపిష్టి. ఆ ఫ్రెంచివాడితో పోలిస్తే నాకిష్టంలేని మా ముసలి రష్యనుతాత చాలా గట్టివాడు. కాని, అతనియందున్న నా దృక్పథాన్ని ఇదేమీమార్పుచేయలేదు. అయితే, నేను అదివరకుఎరిగివున్న ఒక మనిషినిగురించెఅయినప్పటికీ ఇదివరకు తెలియని అనేక విషయాలు పుస్తకంద్వారా గ్రహించవచ్చునని మాత్రం కొత్తగా తెలుసుకున్నాను.

నిషిని నొవొగరాడ్ ప్రజల జీవితంకంటె జర్మనీ ఇంగ్లాండు దేశాల ప్రజల జీవితం కొంత భిన్నమైనదే అయినప్పటికీ, వారైనా అంత మంచిజీవితం జీవించడంలేదని 'మిడిల్ మార్చ్' అనే జార్జి ఇలియట్ గ్రంథమూ, అయర్ బాక్, స్పీల్ హాగన్ల గ్రంథాలూ చదివి తెలుసుకున్నాను. ఆ పుస్తకాల్లోకూడా ఇక్కడిలాంటి సంగతులే — వాళ్ళ వాళ్ళ దమ్మిడీలూ, దరిద్రాలూ — ప్రతి దాంట్లోనూ దైవభీతి ఉండాలనీ, దేవుణ్ణి ప్రేమించాలని ఉండేది — కాని, మా వీధిలోవున్న మనుషుల్లాగానే, వాళ్ళుకూడా ఒకళ్ళనొకళ్ళు చస్తే ప్రేమించేవారు కాదు. ఈ మెజారిటీ మనుషులకంటే ఏదోవిధంగా విలక్షణంగావుండే మనుషుల్ని అసలే ప్రేమించేవాళ్ళు కాదు. రష్యన్ ప్రజలకూ, తక్కినదేశాల ప్రజలకూ వుండే పోలికలను గురించి కాక తేడాలను గురించే తెలుసుకోవాలని ప్రయత్నించాను. కాని, పోలికలు మాత్రమే నాకు నిజంగా కన్పించాయి.

థాకరే వ్రాసిన 'వానిటీ ఫెయిర్' లోని పాత్రలలాగానే నా తాతస్నేహితులైన ఇవాన్ షురోవ్ యాకోవ్ కోటెల్నికోవ్ మొదలైనదివాలాతీసినవర్తకులుకూడా మాట్లాడేవాళ్ళు; అదేవిధంగా ప్రవర్తించేవాళ్ళు. 'బుక్ ఆఫ్ సామ్స్' అనే పుస్తకంనుంచి ఆచక్కని సంగీతంతో కూడిన భాషవల్ల — అసలు చదవడమనేది నేను నేర్చుకున్నాను. అందుకే ఆ పుస్తకమంటే నాకు ప్రేమ. నా తాతా, యాకోవ్ కోటెల్నికోవ్ లు తమ బిడ్డలనుగురించి ఒకరికొకరు నేరాలు చెప్పుకుంటుంటే, తిరుగుబాటు చేసిన తన కొడుకు అబ్సాలంను గురించి డేవిడ్ రాజు భగవంతుడికి చెప్పుకొన్న సన్నివేశం జ్ఞాపకం వచ్చేది. ఇప్పటి కాలపువాళ్ళు మరీ ఉగ్రవాళ్ళు అంతకంతకూ చెడిపోతున్నారనీ, సోమరిపోతులై, మతిలేకుండా అదుపాజ్ఞలు లేకుండా పోతున్నారనీ దైవభీతి అనేది లేనేలేదని — తమ కాలంలో ఎన్నడూ ఇలాంటిది ఎరగమనీ ముసలివాళ్ళు చెప్పుకుంటున్నప్పుడు వాళ్ళు మాట్లాడేది వాస్తవం కాదనిపించేది. డికెన్స్‌లోని మోసపు పాత్రలన్నీ నాకు ఇలాంటి విషయాలను అవగతం చేశాయి.

నేను చదువుకోడంలో ఒక విధానంగానీ, క్రమంగానీ వుండేదికాదు; అంతా ఏదోఅదృష్టం. మా యజమాని తమ్ముడు విక్టర్ సెర్జయేవ్‌కు—జావియర్ డి మాంటే

పిక్, గాబరీ, బనియర్ మొదలైన ఫ్రెంచి రచయితల నవలలంటే ఇష్టం. అవి చదివిన తర్వాత, విప్లవకారులను నాస్తికులుగా పేర్కొని అసహ్యంగా వర్ణించిన రష్యన్ గ్రంథాలు చదవటం మొదలుపెట్టాడు. నేనుకూడా ఈపుస్తకాలన్నీ చదవడం తటస్థించింది. వీటిలో నాకు మామూలుగా కనిపించే రకంమనుషులు కనిపించక పోవడం ఆనాడునన్ను తనతోరమ్మని పిలిచినఖైదీ లాంటివాళ్లు కనిపించడం చూస్తే చాలా సంతోషంగావుండేది. కాని ఈ 'విప్లవకారులు' ఏంకోరుతున్నారో నాకు నిజంగా అర్థమయ్యేదికాదు; ఈ విప్లవకారులను నీచాతినీచంగా చిత్రించిన గ్రంథకర్తల లక్ష్యంకూడా నాకు బోధపడేదికాదు.

అదృష్టవశాత్తూ, పోమ్యలోవిస్కీ వ్రాసిన 'మోలటోవ్', 'లిటిల్ మాన్స్ లక్' అనే కథలు నా చేతిలో పడ్డాయి. అవిచదివాక మధ్యతరగతి జీవితంలోని దుఃఖమూ దారిద్ర్యమూ, మధ్యతరగతివాళ్ళ అమృక్కతినేరకపు ఆనందమూ నాకు అర్థమైనాయి. అందులో గౌరవంకల మోలటోవ్ కంటె ఈభయంకర నాస్తికవాదులే మెరుగనిపించింది.

విదేశసాహిత్యం నాకు కావలసినన్ని సాధర్మ్యాలు సమకూర్చిపెట్టింది. ప్రజలను అంతసజీవచిత్ర ప్రతిమలుగా తీర్చిదిద్దిన ఆ కళాకౌశలం నన్ను ఉత్తేజితుణ్ని చేసింది. నేనుకూడా అలాచేయగలనేమో అనిపించేది. దీనికితోడు రష్యన్లకంటె వాళ్లు ఎక్కువ కార్యశూరులు; తక్కువగామాట్లాడేవాళ్ళు, ఎక్కువపనిచేసేవాళ్ళు. ఫ్రెంచి సాహిత్యంలోని స్టెండాల్, బాల్జాక్, ఫ్లాబర్ కవిత్రయంయొక్క వైజ్ఞానికపరిభావం రచయితగా నామీద చాలా పనిచేసింది. ప్రారంభకులు వారిగ్రంథాలు చదివితీరాలనికూడా నా ఉద్దేశం. వారు మహత్తర ప్రతిభావంతులైన కళాకారులు; శిల్పంలో సిద్ధహస్తులు. అంత సమర్థులైన రచయితలు యింతవరకూ రష్యన్ సాహిత్యంలో లేరు. వారిరచనలను నేను రష్యన్ భాషలోనే చదివినప్పటికీ, ఫ్రెంచి భాషలో వారు చూపినశిల్పం నాకళ్లకు కనిపించకుండా పోలేదు. మేన్ రీడ్, కూపర్, గస్టేవ్, ఎమార్డ్, పాన్సన్ డు టెర్రైల్ మొదలైనవారు వ్రాసిన చౌకరకం చెత్త చదివిన తర్వాత, స్టెండాల్ బాల్జాక్ ఫ్లాబరులకథలు చదువుతుంటే నాకెంతో అమృత మనిపించింది.

ఈస్టరు తర్వాత ఒక ఆదివారం సాయంత్రం పండుగ కోలాహలంలో మునిగిపోయిన జనంనుంచి తప్పించుకోడానికి నేను ఒక ఇంటి కప్పుమీది కెక్కి, అక్కడ కూర్చొని ఫ్లాబర్ వ్రాసిన 'ఎ సింపిల్ హార్ట్' అనే కథ చదవడం ఇంకా నాకు గుర్తే. ఆ కథ నన్ను కేవలం ముంచివేసింది. నాకు చుట్టూ జరిగే కోలాహలం అంతా అంతర్ధానమై పోయింది. ఏమీ కనిపించడంలేదు. వినిపించడం లేదు—అంతా ఆకథే నాతలలో నిండింది ఆ కథలోని ఆ సాధారణ స్త్రీ మూర్తి—పెద్ద వీరోచితంగా ఏమీ కొల్లకొట్టక పోయినప్పటికీ, పెద్దపెద్ద అఘాయిత్యాలు ఏమీ చెయ్యకపోయినప్పటికీ, ఆ మూగ ఆ పనిమనిషే నా మనస్సంతా నిండిపోయి, బయట జరుగుతున్న కోలాహలంనుంచి నా కళ్ళకుకట్టిన తెరలాగా అయిపోయింది. నిరుత్సాహకరమైన ఒక పనిమనిషి జీవితాన్నిగురించి అల్లిన ఆ స్పష్టమైన మామూలుమాటలు నన్నింతగా ఎందుకు కదలించాయో అర్థంచేసుకోవడం కష్టసాధ్యమైంది. ఇక్కడ ఏదో అర్థంకాని

చిత్రం వున్నట్లు తోచింది. కాని దాన్ని పరిశీలిద్దామనే ఆలోచన లేదు. అప్రయత్నంగానే ఉత్సాహితుడనై ఒక అడవి మనిషిలాగా పుస్తకాన్ని అలాగే వెలుతురులో పెట్టి, ఆ పంక్తులమధ్య ఆ చిత్రమేమిటో వెతుకుతున్నట్లుగా కూర్చున్నాను.

అద్భుతమైన భయంకరమైన అఘాయిత్యాలు వర్ణించిన అనేక పుస్తకాలు నేను చదివాను. తర్వాత స్టెండాల్ వ్రాసిన 'ఇటాలియన్ కథలు' చదివితే, అవి ఎట్లా వ్రాశాడో అర్థంకాలేదు. అందులో అతను క్రూరులనూ, పగపట్టిన హంతకులనూ చిత్రించాడు. కాని; ఏ మహాపురుషులను గురించి చదువుతున్నట్లుగానో, మెడోనా స్వప్నం — నరకంలో ఆ పాపాలు చేసిన వాళ్ళు పడుతున్న బాధలమధ్య ఆమె సంచరించడం — ఇదంతా వింటున్నట్లుగానో అనిపించింది.

కాని, బాల్జాక్ వ్రాసిన 'లాపేడీషాగ్రిల్', ఆ నవలలో — ఆ ధనవంతుడి ఇంట్లో జరిగిన భగవద్భజన — ఇరవై ముప్ఫైమంది ఒకే పర్యాయం వెర్రిఅల్లరిచేస్తూ, మాట్లాడుతూ వుండటం, నాకు వినిపిస్తున్నట్లుగా అనిపించి ఆ వివిధస్వరాలకూడికా నన్ను ప్రత్యేకంగా ముగ్ధుణ్ణిచేశాయి. అయితే యిక్కడముఖ్యమైనవిషయం ఏమంటే; బాల్జాక్ వాళ్ళ ముఖాలుగానీ ఆకారాలుగానీ ఏమీవర్ణించకపోయినప్పటికీ — నాకు వాళ్ళమాటలు వినిపించడమేగాక, వాళ్ళలో ఒక్కొక్కడూ ఎట్లామాట్లాడుతున్నదీ వాళ్ళకళ్ళూ, వాళ్ళచిరునవ్వులూ, వాళ్ళఊహలుకూడా — కనిపించాయి

ఒక్కమాటలో చెప్పాలంటే; ఆ మాటలద్వారా మనుష్యుల్ని చిత్రించడం, వాళ్ళు మాట్లాడేది మనకు వినిపించేటట్లు సజీవంగాచూపే ఆశిల్పం, ఆ సంభాషణా చాతుర్యం చూస్తే నాకు బాల్జాక్‌మీద, ఫ్రెంచి వాఙ్మయంమీద గాఢమైన అభిమానంకలిగింది. నిజానికి బాల్జాక్ రచనలు తైలవర్ణాలతో చిత్రించబడ్డాయని చెప్పవచ్చు. నేను మొట్టమొదటిసారి రూబెన్సుచిత్రాలు చూసినప్పుడు నాకు బాల్జాక్ జ్ఞప్తికి వచ్చాడు. నేను ఉద్రేకపూరితమైన డోస్టొవిస్కీ నవలలు చదివినప్పుడు అతను, నవలారచనలో సిద్ధహస్తుడైన బాల్జాక్‌కు ఎంతో ఋణపడి వుంటాడనిపించింది. సిరాతో కలంతోగీసిన బొమ్మల్లాగా సంగ్రహంగాను ఆర్భాటరహితంగాను ఉన్నప్పటికీ, గోన్‌కోర్టుల రచనలూ, జోలాయొక్క భయంకర దుఃఖమయ జీవిత చిత్రాలూ అంటే నాకిష్టం. విక్టరుహ్యూగో నవలలు నన్నంతగాకదల్చలేకపోయాయి. 'క్వాట్రి వింగ్ట్ ట్రైజ్' కూడా నేను ఉదాసీనంగానే చదివాను. దీనికి కారణం, యానటోల్ ఫ్రాన్స్ వ్రాసిన 'లెస్ డీక్స్ ఆన్ట్ సెఫ్' చదివాకనే నాకుబోధపడింది. నేను చాలా విషయాలను ద్వేషించడంనేర్చుకున్న తర్వాతనే స్టెండాల్ నవలలుచదివాను. అతని శాంతగంభీరస్వరమూ, ఆ తీవ్రవ్యంగ్యధోరణీ నా ద్వేషాన్ని బలపరచాయి.

నేనుచెప్పిన పుస్తకాలనుబట్టి తేలేదేమిటంటే — నేను ఫ్రెంచి సాహిత్యంనుంచే వ్రాయడంనేర్చుకున్నానని. ఇది అదృష్టవశాత్తూ నాకు లభించినప్పటికీ ఎంతమాత్రం చెడ్డది కాదనీ; ఈ కళాసిద్ధుల ఉత్తమరచనలను మాతృకలో చదివి, శబ్దప్రయోగంలో వారుచూపిన ఉత్తమశిల్పాన్ని గ్రహించేందుకుగాను, యువరచయితలందరూ ఫ్రెంచి భాష నేర్చుకోవాలనీ నేనుసలహా ఇస్తున్నాను.

తర్వాత, కొంత కాలానికి గొగోల్ టాల్‌స్టాయి, టర్గెనోవ్, గోంచరోవ్, డోస్టయేవిస్కీ లెస్కోవ్‌ల రచనలు చదివాను. అదే నేను రష్యన్ సాహిత్యం చదవడం. తన అద్భుతవిజ్ఞానంతోను, భాషా పాటవంతోను లెస్కోవ్ నన్ను ఎంతో ఆకర్షించాడు. రష్యాదేశంలోని ప్రతి విషయాన్ని గురించీ అతనికి స్పష్టమైన జ్ఞానం వుంది. నిజానికి అతనికి మన సాహిత్యంలో రావలసినంత విలువ ఈనాటికీ రాలేదు. అతనికి తానెంతో ఋణపడి వున్నట్లు చెకోవ్ చెప్పుకున్నాడు. రెమిసోవ్ కూడా ఆమాటే చెప్పుకోవాలి.

ఈ సంబంధాలనూ, పరస్పర ప్రభావాలను గురించి ఇంతగా చెబుతున్నానంటే దీనికి కారణం — ప్రతి రచయితకూ రష్యన్ సాహిత్యాన్నీ, విదేశ సాహిత్యాన్నీ గురించిన జ్ఞానం అత్యంత అవసరమని నొక్కి చెబుతున్నానన్న మాట.

నాకు ఇరవైయేళ్ళ వయసు వచ్చేసరికే నేను ఇతరులకు చెప్పదగినవీ చెప్పవలసినవీ ఎన్నో విషయాలూ అనుభూతులూ పొందానని అర్థంచేసుకొన్నాను. కొన్ని విషయాల్లో నేను ఇతరులకంటే భిన్నమైన అనుభూతి పొంది, వాటిని భిన్నంగా అర్థం చేసుకున్నానని కూడా నాకు తోచింది. ఈ ఆవేదనతో నేను నిరంతరం ఏదో మాట్లాడుతూనే వుండేవాణ్ణి. టర్గెనోవ్ వంటి ఉత్తమ రచయిత వ్రాసినవి చదువుతున్నప్పుడుకూడా, అంతకంటే మరోవిధంగా వీరగాథలు చెప్పవచ్చు ననిపించింది. ఈసరికల్లా నేను చక్కగా కథలు చెప్పగల వాళ్ళలో ఒకణ్ణని పేరు సంపాదించుకున్నాను; నాచుట్టూ నివసించే హార్బరు పనివాళ్ళూ, వడ్రంగులు, రైల్వే కార్మికులు, యాత్రికులూ, అంతా — నేను కథలు చెబుతుంటే చెవియొగ్గి వినేవాళ్ళు. నేను చదువుతున్న పుస్తకాల్లోని కథలు వారికి చెప్పేటప్పుడు వాటిని కొంత కొంత మార్చి, కొంత కొంత నా అనుభవం కలిపి చెప్పటం గ్రహించాను. నాకు సాహిత్యమూ జీవితమూ ఒక్కటిగానే ఇమిడిపోయాయి కనుక, ఇది సాధ్యమయింది. మానవుడిలాగానే జీవితంతో కూడిందే పుస్తకం. అదికూడా జీవంతో వాస్తవిక విషయాలను గూర్చి సంప్రదిస్తుంది. మానవుడు ఇంతవరకు సృష్టించిన, ఇకముందు సృష్టించనున్న అనేక ఇతరవస్తువుల్లాగా, పుస్తకం ఒక 'వస్తువు' కాదు.

నా కథలువిన్న విజ్ఞానవంతులు "వ్రాయడానికి ప్రయత్నించ"మని నాకు చెప్పారు.

నేను తప్ప తాగి వెర్రిగా మాట్లాడేస్తున్నట్లు తరచూ అనిపించేది. నాకు కష్టంగానీ, సుఖంగానీ కలిగించిన ప్రతిఒక్క విషయాన్ని గురించీ మాట్లాడాలనే కోరిక వల్లనే ఈ నోరు తూలడమంతా. అదంతా చెప్పేస్తే, హాయిగా బరువు తీసేసుకున్నట్లు సంతృప్తి పడదామనిపించేది. మూర్ఛలు వచ్చే స్త్రీకిలాగా, నాగొంతులో ఏదో ఉండ గట్టుకుపోయి కక్కి వేద్దామనిపించేది. నిజంగా తెలివి తేటలుగల ఆ 'యాసటోలీ, కిటికీలోంచి సర్వదా చూస్తుంటే నా స్నేహితుడు ఎవ్వరూ ఆసరా ఇవ్వకపోతే చచ్చిపోతాడర్రోఅని అరుద్దామనిపించేది. వీధులెంటతిరిగే ఆధ్క్షసా నిజంగా మంచిదనీ, ఆమె వ్యభిచారిణి కావటమనేది కేవలం అన్యాయమనీ పుస్తకాల్లో మురిగిపోయ్యే మన మంత్రసాని యాకోవ్ లెవా కంటే ఆ అడుక్కునే చూటిట్సా తెలివిగలదనే సంగతి తెలియనట్లే; ధరాసావు ఉపయోగించు

కోనే విద్యార్థులకు ఆమె సంగీత బోధగా తెలియదనీ గొంతెత్తి చెప్పివేద్దామనిపించింది.

నా స్నేహితుడైన విద్యార్థి గురీప్లెట నోవ్ కూడా చెప్పుతుండగా, నేను కొన్ని పద్యాలు వ్రాసాను. ధరాసాను గురించీ, యానటోలీవి గురించీ వ్రాసాను. మామూలుగా వసంతంలో కరగిపోయేమంచు ఈ సంవత్సరం, పెద్ద మురికివాగులాగా అయిపోయి, రొట్టెలు చేసేవాళ్ళు పనిచేసుకునే నేలగదులమీద పడడమనే ఉద్దేశంతో, వసంతంవచ్చినా ఇంకా కరగడం లేదనీ, వాల్గా సుందరమైన నదిఅనీ; ఉప్పుబిస్కట్టు చేసే కుజక్ దైవద్రోహిఅనీ, జీవితమంటే ఆత్మను చంపేసే చాలినీచమైన బాధాకరమైన విషయమనీ వ్రాసాను.

పద్యాలు వ్రాయడం నాకు తేలికగానే వచ్చింది. కాని నా పద్యాలు నిరర్థకమైనవనీ, నాలో ప్రతిభావ్యుత్పత్తులు తక్కువనీ; నేను గ్రహించగలిగాను. పుష్కిన్, లెర్మంటోవ్, నెక్రాసోవుల కావ్యాలూ, కురోష్కిన్ వ్రాసిన బీరేంజర్ అనువాదాలూ చదివి, ఆ కవులతో నేను ఎంతమాత్రం పోలికకు రాలేనని స్పష్టంగా అర్థము చేసుకున్నాను. పద్యంకంటె వచనం వ్రాయడం ఎక్కువ కష్టంగా తోచడంవల్ల వచనరచనంటే నాకు భయంగా వుండేది. వచనం వ్రాయాలంటే సునిశితమైన చూపు కావాలి; ఇతరులకు కానరాని అనేక విషయాలు చూసి అవగతం చేసుకొనే సమర్థత కావాలి. ప్రత్యేకం విశిష్టతతో, ఒండ్రాంటితో ఒదిగిపోయే శక్తివంతమైన మాటల కూర్పు కావాలి. ఇవన్నీ ఇలా ఉండగా మామూలు వచనం వ్రాయడం నా శక్తికి మించిన పని అనుకొని, శబ్దాడంబరముతో కూడిన వచనం వ్రాద్దామని ప్రయత్నించాను. కాని, తీరా నేను వ్రాసిందేమిటని చూస్తే చాలా శోచనీయంగానూ, హాస్యాస్పదంగానూ తేలింది. ఈ ఆడంబరమైన వచనధోరణిలో "ది సాంగ్ ఆఫ్ ఓల్డు ఓక్" అనే దీర్ఘమైన గీతం వ్రాశాను. ఆ కావ్యబొమ్మను కొరలెంకో ముక్కలు చెక్కలు చేసిపారేసాడు. ఆ గీతంలో నేను వ్రాసిన 'జీవిత సుడిగుండం' అనే వ్యాసంలోని భావాలను పరిణామవాదాన్ని కూర్చిన చర్చలతో చిత్రించినట్టు జ్ఞాపకం. ఆ గీతం మొత్తంలోనూ నాకు ఒక్క వాక్యం మాత్రమే గుర్తుంది.

"ఈ ప్రపంచంతో ఏకీభవించకపోవడం కోసమే నేను ప్రపంచంలోకి వచ్చాను" — అంతేకాదు, నేను నిజంగా పరిణామవాదాన్ని అంగీకరించలేదుకూడా.

"మన దరిద్రపుభాష నిర్జీవంగానూ అసహ్యంగానూ వుంటుం"దని నాడ్సన్ గారు చెప్పినట్టు జ్ఞాపకం. కాని, మాలో కొద్దిమంది కవులుమాత్రం ఈభాషాదారిద్ర్యాన్ని గురించి చెప్పే మాటలన్నీ ఒక్క రష్యన్ భాషకే కాక, మానవభాష కంతటికీ వర్తిస్తాయి. మాటల్లో ఇముడ్చడానికి వీలులేని భావాలూ అనుభవాలూ ఉన్నాయన్న సత్యంమీదనే ఈ వాదం బయలుదేరింది. మాటల్లో ఇమడని విషయాలు అలావుంచితే, రష్యన్ భాష చాలా సంపన్నమైనది. అద్భుతమైన వేగంతో దినదినాభివృద్ధి చెందుతున్నది.

భాష మానవుడిచేత నిర్మించబడినదనే విషయం ఇక్కడ చెప్పడం అవసరం. భాషను సాహిత్యభాషగాను, వ్యావహారిక భాషగాను విభజించడమంటే ఒకవంక 'ముడి' భాషనూ, మరోవంక కళావేత్తలచే

దిద్ది తీర్చబడిన భాషనూ లక్షిస్తున్నామన్న మాట. ఈ విషయాన్ని మొట్టమొదట తెలుసుకున్నవాడు పుష్కిన్. అతనే ప్రజలు మాట్లాడే భాషా సామగ్రిని ఎలా ఉపయోగించుకోవాలో, దాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో మొట్టమొదటి సారిగా తన రచనలో స్పష్టపరిచాడు.

తన దేశంయొక్క, తన వర్గంయొక్క ఆవేశ పూరితమైన వాక్కులాంటివాడు రచయిత; అతనే వాళ్ళ కన్ను; అతనే వాళ్ళ చెవి, వాళ్ళ హృదయం — ఇంతెందుకు, రచయిత తన కాలానికి కుత్తుకలాంటివాడు. అతను సాధ్యమైనంత ఎక్కువ విజ్ఞానం సంపాదించుకోవాలి, అతను పురాతన సంస్కృతిలో పరిచయం పొందిన కొద్దీ తన కాలాన్ని ఎక్కువ స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతాడు. అంత స్పష్టంగానే నేటి ప్రపంచ విప్లవ పరిస్థితులతో కూడిన యుగ స్వభావాన్నీ విప్లవ బాధ్యతలనూ తెలుసుకోగలుగుతాడు. తన దేశప్రజల చరిత్రను తెలుసుకోవడంకూడా అవసరమే. ఇక, ప్రజలు అప్పటి సాంఘిక రాజకీయ సమస్యలనుగురించి ఏమనుకొంటున్నదీ అర్థం చేసుకోవలసిన అవసరంకూడా తక్కువది కాదు. ప్రజలు ఎలా ఆలోచిస్తారో అది కట్టుకథల్లోను పుక్కిటిపురాణాల్లోను సామెతలలోను కనిపిస్తుందని మానవచరిత్రనూ సంస్కృతీచరిత్రనూ పరిశీలించేవారు చెబుతారు. ఎక్కువమంది ప్రజానీకం ఆలోచించేరీతికి సామెతలు చక్కని ప్రతిబింబాలు అనే మాట పూర్తిగా నిజం.

సామెతలు అతి సంగ్రహంగా ఈనాటి కష్టజీవుల సాంఘిక చారిత్రిక జీవితానుభవంతో కూడుకొని వుంటాయి. చేతిలో వేళ్లు ముడుచుకున్నట్లుగా ఇముడ్చుకోడానికి వీలైన పదాలను ఏర్చి కూర్చుకోడానికీ; ఇతరులచేత మెత్త మెత్తగా కూర్చబడి నాటి వాస్తవ బాధ్యతలను మరుగుపరిచిన చచ్చు పదాలను వదిలిపెట్టడానికీగానీ — రచయిత ఈ సామెతల వెనుకనున్న కష్టజీవుల సాంఘిక చారిత్రిక జీవితానుభవచరిత్రను అవగతం చేసుకోవాలి.

నేను ఈ సామెతలనుంచీ, లేదా ఈ సూత్రప్రాయమైన చిన్న చిన్న మాటలలో ఆలోచించడంనుంచీ ఎంతగానో నేర్చుకున్నాను.

ఇలాంటి సజీవభావాలే నాకు ఆలోచననూ రచననూ నేర్పాయి. అలా మామూలు రైతులూ కూలీలూ, గుమస్తాలూ, పిన్నపెద్దలూ వెలిబుచ్చిన ఇలాంటి భావాలే పుస్తకాల్లో, ఇంకో మాటల్లో పొదగబడి కనిపించాయి. ఈ విధంగా జీవితవాస్తవాలూ, సాహిత్యమూ అన్యోన్యానుబంధాన్ని వెలిబుచ్చాయి.

మహాకవులు రకరకాల పాత్రలనూ, స్వభావాలనూ ఎలా చిత్రిస్తారో ఇదివరకే చెప్పాను. కాని ఒకటి రెండు ముఖ్యమైన ఉదాహరణ లివ్వటం మంచిదనుకుంటాను. గోథే వ్రాసిన 'ఫౌస్ట్' అనే గ్రంథం ఒక ఉత్తమ కళాఖండం. పూర్తిగా భావనా బలంతో సృష్టించబడ్డది. మేధశ్శక్తి పిండి పిడిచిన సారం. ఆకృతి పొందిన భావాల యొక్క అవతారం అని చెప్పవచ్చు. ఈ 'ఫౌస్ట్' అనే గ్రంథాన్ని నా ఇరవయ్యోయేట చదివాను. ఆ తర్వాత క్రిస్టాఫర్ మార్లోవ్ అనే ఆంగ్ల రచయిత కూడా 'ఫౌస్ట్'ను గురించే వ్రాశాడని తెలిసింది. 'పాన్ టివార్డోవిస్కీ' అనే పోలిష్ నవలకూడా ఒకరకం 'ఫౌస్ట్'. పాల్ డి మస్సెట్ అనే ఫ్రెంచి రచయిత వ్రాసిన

'సీకర్ ఆఫ్టర్ హాపినెస్', అనేదికూడా ఇలాంటిదే. వీటన్నిటినీ పరిశీలిస్తే తన వ్యక్తిగత సుఖం కోసమూ, ప్రజల మీద ప్రకృతి శక్తులమీద తన అధికార ప్రాబల్యంకోసమూ దయ్యానికి తన ఆత్మను అమ్ముకొన్న 'ఫాస్ట్' అనే వాడి కథ, మధ్యయుగాలనాటిది, వీటన్నిటికీ మూలమని తేలింది. అన్ని లోహాలనూ బంగారం చేయాలనీ, మనిషికి శాశ్వతాయుష్యం ప్రసాదించే సంజీవి తయారు చెయ్యాలనీ ప్రయత్నించిన మధ్యయుగపు స్వర్ణయోగుల కృషి జీవితానుభవ పరిశీలన నుంచి అసలు ఈ కథ పుట్టింది. ఈ స్వర్ణయోగుల్లో చాలామంది నిజంగా ఆ కలలు గనే వాళ్ళున్నారు; కాని మోసగాళ్లూ, స్వార్థపరులూ కూడా లేకపోలేదు. వీళ్లు ఒక గొప్పశక్తికోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడం హాస్యాస్పదమై-అదే మధ్య యుగాలనాటి డాక్టర్ ఫాస్ట్ అనేక అఘాయిత్యాలు చెయ్యడం, అతనికి చివరకు దయ్యంకూడా ఈ స్వర్ణయోగాన్నీ, సంజీవినీ ప్రసాదించలేకపోవడం___ ఈ కథల్నింటిలోనూ చిత్రించబడింది.

శోకమూర్తి అయిన ఈ డాక్టర్ ఫాస్ట్ ప్రక్కనే, అన్ని జాతులకూ పరిచితుడయిన మరో పాత్ర కనిపిస్తాడు. ఇటలీలో అతని పేరు పల్సినెల్లో, ఇంగ్లాండులో పంచ్; టర్కీలో కారగెట్; మన దేశంలో 'పెట్రూష్కా. అతను తోలుబొమ్మలాటలో అజేయుడయిన వీరుడు. అతడు ప్రతి వస్తువునూ, ప్రతి మనిషినీ ఓడిస్తాడు. పోలీసులనూ, మఠాధిపతులనూ, చావునూ, దయ్యాన్నీ కూడా ఓడిస్తాడు. అతను మాత్రమే చావు లేకుండా ఉంటాడు. ఇందులో ప్రతి ఆటంకాన్నీ, ప్రతి మనిషినీ జయించి నిలబడేది తాము మాత్రమేననే కష్టజీవుల దృఢవిశ్వాసం ఆకృతివహించింది.

ఈ రెండు ఉదాహరణలు నేను పైన చెప్పినదాన్ని ధ్రువపరుస్తాయి. సంప్రదాయంగా వస్తున్న 'అజ్ఞాత' సాహిత్యంలో, అంటే- ఎవరు సృష్టించిందీ తెలియని అపౌరుషేయసాహిత్యంలో కూడా ఒకే వర్గానికి చెందిన అనేకమంది వ్యక్తుల స్వభావాలూ, ధోరణులూ అన్నీ గుదిగుచ్చి అవర్గాన్ని ప్రతిబింబించేటట్లు ఒక పాత్రలో చిత్రించడం కనిపిస్తుంది. ఈ సూత్రాన్ని ఖచితంగా పాటించినట్లయితే, రచయితకు పాత్ర చిత్రణలో ఇది ఎంతో తోడ్పడుతుంది. ఈవిధంగానే ఛార్లెస్ డీ కాస్టర్, రోమారోలా, ఆల్ఫోన్స్ డాడెట్ లు తమ పాత్రలను సృష్టించారు. పూర్తిగా అభివృద్ధిచెందిన పరిశీలనాశక్తీ, పోలికలను కనిపెట్టే తేడాలను పసిగట్టగల సమర్థతా, ఉండి, ఇంకా ఇంకా నేర్చుకోడానికి సిద్ధపడినప్పుడు మాత్రమే రచయిత అలాంటి విశిష్టవ్యక్తులను ప్రతిబింబించే పాత్రలను చిత్రించ గలుగుతాడు. ఎక్కడయితే అలాంటి స్పష్టమైన జ్ఞానం వుండదో, అక్కడ ఊహ ఆ స్థానాన్ని ఆక్రమించి పది ఊహల్లో తొమ్మిది తప్పుదారి పడతాయి.

ఆబ్లొమోవ్, రూదిన్, రెజనోవ్ లతో సమానంగా ఉత్తమ పాత్రలనూ స్వభావాలనూ చిత్రించడంలో నేనుకూడా సిద్ధహస్తుడనని అనుకోవడంలేదు. కాని 'ఫామా గోర్దయేవ్' వ్రాయడానికి నేను, తమ తండ్రుల జీవితాలమీదా వృత్తులమీదా అసంతృప్తిచెందిన వర్తకుల బిడ్డలను అనేకమందిని, పరిశీలించవలసి వచ్చింది. అంతు

(తరువాయి 61 వ పేజీ)

క్వాంటం సిద్ధాంతం

★

డి. ఎ. ఎ. ఎస్. నారాయణరావు

యూదులకు వ్యతిరేకమైన ప్రచారం చేయుటలోను, యూదులను హింసించుటలోను హిట్లరు ప్రభుత్వానికి అంశగానున్నందుకు గాను ఎనుబదితొమ్మిదిఏండ్ల వృద్ధు అయిన మేక్సుప్లాంకు ఆస్తిని వశపరచుకొని, అతనిని నాలుగు సంవత్సరాలు లేబరు కేంపులో నిర్బంధింపవలెనని ఈ మధ్యనే నిర్ణయింపబడింది. మేక్సుప్లాంకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రజ్ఞుడు. అతను స్థాపించిన క్వాంటం సిద్ధాంతము శాస్త్రజ్ఞానములో ఒక గొప్పవిప్లవాన్ని తీసికొనివచ్చింది. ఆధునిక శాస్త్రఅభిప్రాయాలకన్నిటికీ ఇది పునాది అయిందని చెప్పవచ్చును. అటువంటిఉత్తమశాస్త్రాభివృద్ధికి దారితీసిన మేక్సుప్లాంకు అభివృద్ధినిరోధకమైన నాజీ శక్తులతో సహకరించుట విచారకరమైన విషయము. నాజీజమును నిర్మూలించడానికి జర్మనీ దేశములో స్థాపింపబడిన కోర్టు అతనిపై శిక్ష విధించుట న్యాయమా అన్యాయమా అను విషయాన్ని కాక, అతడు స్థాపించిన క్వాంటం సిద్ధాంతాన్ని గురించి చర్చిద్దాము ప్రస్తుతం.

వివిధ పదార్థాలన్నీ కంటికి కనబడని అతి సూక్ష్మమైన పరమాణువులనే కణాలచే నిర్మింపబడినవని ఇదివరకు తెలిసిన విషయమే! పరమాణువు లన్నిటిలోకి ఉదజని పరమాణువులు తేలికైనవి. ఒక్కొక్క ఉదజని పరమాణువు ·000 000 000 000 000 000 000 0017 గ్రాముల బరువుంటుంది. మనము కొంత ఉదజనిని తీసికొని అతిసున్నితమైన త్రాసుతో తూచినామనుకోండి. ఆ బరువు పై పరిమాణానికి కొన్ని నిండుసంఖ్యల (integer) రెట్లు మాత్రమే ఉంటుంది. ఎందువల్లననగా— మనము తీసికొన్న ఉదజనిలో కొన్ని పూర్ణాంకముల పరమాణువులు ఉంటాయి. పరమాణువులో భాగాలు, లేక భిన్నాంకములు ఉండవు. కనుక మనము తీసికొన్న ఉదజని బరువు

ఇష్టమొచ్చినంత ఉండలేదు. పై పరిమాణానికి నిండుసంఖ్యల రెట్ల లోనే ఉంటుంది గాని, దానికి $234\frac{1}{3}$ రెట్లు, $17\frac{1}{2}$ రెట్లు ఇలాగ ఉండలేదు. దీనిప్రకారం బరువును అనవరతంగా (continuous) గా మార్చడం అసాధ్యమని తెలుస్తూంది ఉదజనిబరువు 17×10^{-25}. అయినా ఉండాలి, దానికి రెండు రెట్లయినా ఉండాలి, మూడు రెట్లయినాఉండాలి, ఇంకే నిండు సంఖ్య రెట్లయినా ఉండాలి. కనుక, ఈబరువును అనవరతంగా కాక గెంతుల ద్వారానే మార్చగలమని తెలుస్తూంది. ఇలాగ బరువు గెంతుల ద్వారా మారడం వలన దీనిలో ఒకవిధమైన విచ్ఛేదం(discontinuity) ఉందని చెప్పవచ్చును. మనం సాధారణంగా ఉపయోగించే ప్రత్రాసుగా ఇంత చిన్న బరువును తూచలేదు. కనుక మనము తూచగలిగినంతవరకు మన ఇష్టమొచ్చినంత బరువుగల పదార్థాన్ని తీసికొనవచ్చునని తోస్తుంది. కాని ఇంత చిన్న బరువును తూచగలిగిన త్రాసే ఉంటే, బరువులో ఉన్న అనవరతత్వము లేక విచ్ఛేదము గోచరమవుతుంది.

బరువులోనే కాక విద్యుత్తులో కూడా ఇటువంటి పరమాణుత్వము అనవరతత్వము ఉన్నాయని తెలుస్తూంది. విద్యుత్తన్నది ఎప్పుడూ ఒక స్థిరాంకానికి (constant) కొన్ని నిండుసంఖ్యల రెట్లలోనే దొరుకుతుందిగాని అనవరతంగా మారలేదు.

బరువు, విద్యుత్తేకాదు, ఇలాగ ఇంకా ఎన్నో గెంతుల ద్వారా మారుతాయి. అనవరతంగా ఉండవు. మన దేశంలో ధనము రూపాయ, అణా, పైసలలో దొరుకుతుంది. ఒక దమ్మిడీకంటెతక్కువ డబ్బు ఎక్కడా దొరకదు. నా జేబులో కొంత డబ్బు ఉన్నదంటే అది $17\frac{1}{4}$ దమ్మిడీలు, $122\frac{1}{3}$ దమ్మిడీలు అయి ఉండలేదు. అది కొన్ని నిండుసంఖ్యగల దమ్మిడీలే అయి ఉండాలి. ఇలాగే ఎక్కడ డబ్బు ఉన్నా అది దమ్మిడీకి కొన్ని పూర్ణాంకముల రెట్లు ఉంటుంది, డబ్బులో దమ్మిడీని ఒక క్వాంటం అనవచ్చును. అప్పుడు డబ్బు ఎక్కడ ఉన్నా ఈక్వాంటంకంటె తక్కువ పరిమాణంలో ఉండదు. ఈ క్వాంటంకు కొన్ని పూర్ణాంకముల రెట్లలోనే ఉంటుంది.

శక్తి (Energy) అనవరతంగా మారగలదని ఇదివరకటి అభిప్రాయం. ఒక వస్తువు శక్తిని ప్రసరించినప్పుడు అది అవిచ్ఛిన్నంగా జరుగుతుందని ఊహించేవారు. వేడిగా ఉన్న పదార్థమిచ్చే ఉష్ణశక్తి ప్రసారముల గురించి జరుపుతున్న పరిశోధనలలో కొన్ని క్లిష్టపరిస్థితులేర్పడ్డాయి. సిద్ధాంతపూర్వకంగా వచ్చిన ఫలితాలు కొన్ని కొన్ని ప్రయోగ ఫలితాలను సమర్థించలేక పోయినాయి. ఆ ఇబ్బందిని తొలగించడానికి మేక్సుప్లాంకు 1900 వ సంవత్సరములో ఒక అసాధారణసూచన చేసేడు. శక్తి అనవరతంగా ఉండలేదనీ, ఒక క్వాంటమునకు కొన్ని పూర్ణాంకముల రెట్లలోనే ఉంటుందనీ అన్నాడు. శక్తి క్వాంటములనే చిన్న చిన్న పేకెట్లలో దొరుకుతుందన్న మాట. ఇలాంటి శక్తి పేకెట్లు నిండు సంఖ్యలలో దొరుకుతాయి గాని భాగాలు దొరకవు. దీనికే 'క్వాంటం సిద్ధాంత'మని పేరు.

శక్తి ప్రసారము అవిచ్ఛిన్నంగా కాక ఇలాగ క్వాంటములలో జరుగుతుందని అనుకోనడం చాలా అసంగతంగాను, నిర్హేతుకంగాను ఉండేది అప్పటి అభిప్రాయాల ప్రకారం. కాని ప్లాంకు ధైర్యం చేసి దానిని సిద్ధాంతీకరించేడు. ఆ సిద్ధాంతంతో ఉష్ణశక్తి ప్రసారాలకు సంబంధించిన ప్రాయోగిక విషయాలనన్నీ సమర్థించగలిగేడు. ఇది సిద్ధాంతానికి ఒక విజయం సమకూర్చింది.

జ్యూ అయిన కారణం వలన జర్మను దేశంనుండి తరుమబడిన ఐన్స్టయిను పండితుడు ఈ క్వాంటం సిద్ధాంతాన్నే ఇంకొన్ని విషయాలకు అన్వయింపజేసి, దీనిని విస్తరింప చేసేడు. కాంతి అలల స్వరూపం గలదని 19-వ శతాబ్దంలో అనుకునేవారు. కాని ఇరవైయవ శతాబ్దప్రారంభంలో కనుగొనబడిన కొన్ని విషయాలు కాంతి అలల సిద్ధాంతాన్ని ఖండిస్తున్నాయి. వాటిని సమర్థించడానికిగాను ఐన్స్టయిను కాంతిలోని శక్తి చిన్నచిన్న పొట్లాలక్రింద లేక క్వాంటముల క్రింద దొరుకుతుందని సిద్ధాంతీకరించేడు. ఆ పొట్లాలకు 'ఫోటాను'లని పేరు. ఒక ఫోటాను ఒక నిర్ణయమైన శక్తి కలిగి ఉంటుంది. కాంతిలోని శక్తి పై దానికి కొన్ని పూర్ణాంకముల రెట్లు

మాత్రమే ఉండగలదు. ఈసిద్ధాంతంతో ఈ శతాబ్దప్రారంభంలోని నూతన దృగ్విషయాలను సమర్థించగలిగేడు ఐన్‌స్టయిన్. దీనికిగాను అతనికి నోబెల్ బహుమానమిచ్చేరు.

1907లో అయిన్‌స్టయిన్ క్వాంటం సిద్ధాంతాన్ని ఇంకొక రంగంలో ఉపయోగించాడు. ఒక పదార్థాన్ని ఒక డిగ్రీ ద్వారా వేడి చెయ్యడానికి కావలసిన ఉష్ణాన్ని దాని తారతమ్యోష్ణత అంటారు ఘనపదార్థాల తారతమ్యోష్ణత సిద్ధాంతములో కొన్ని లోపాలున్నాయి. చాలా పదార్థాల తాలూకు ప్రయోగములు సిద్ధాంతమును బలపరుచుట లేదు. ఐన్‌స్టయిను తారతమ్యోష్ణ సిద్ధాంతములో క్వాంటం సూత్రమును ప్రవేశపెట్టేడు. అలాగునచెయ్యగా ప్రయోగ సిద్ధాంతముల మధ్య సామరస్యం ఎక్కువయింది.

1913 లో నీల్సు బోరు శాస్త్రజ్ఞుడు క్వాంటంసిద్ధాంతమును ద్రవ్యనిర్మాణంలోకి తీసికొని పోయేడు. పరమాణువులో ధన విద్యుత్తుతో కూడిన కేంద్రకం చుట్టూ ఋణ విద్యుత్తుతో కూడిన ఎలక్ట్రానులు తిరుగుతూ ఉంటాయని ఇదివరకు తెలిసికొన్నాము. అలాగ తిరుగుతున్న ఎలక్ట్రానులు ఇష్టమొచ్చిన వలయాలలో తిరగలేవనీ, కొన్ని నియమితమైన వలయాలలో లేక కక్ష్యల (orbits) లో మాత్రమే తిరగగలవని బోరు సిద్ధాంతీకరించాడు. అవి అలాగ నియమితమైన కక్ష్యలలో తిరుగుతాయని అనుకోడానికి క్వాంటం సూత్రమే ఆధారం. ఎలక్ట్రానులుఇలాగ నియమితమైన వేరు వేరు కక్ష్యలలో తిరుగుతున్నప్పుడు ఒకకక్ష్యలోనుంచి ఇంకొక కక్ష్యలోకి గెంతుతూ ఉంటాయి, అలాగ గెంతడంలో కాంతిని ప్రసరించడమో, గ్రసించడమో జరుగుతుంది. ఈ సిద్ధాంతంసహాయంతో శక్తివంతమయిన పదార్థాలిచ్చే కాంతి ప్రసారముల గురించిన ప్రయోగ ఫలితాలను సమర్థించడానికి వీలయింది.

ఎలక్ట్రాను ఒక కక్ష్యనుండి ఇంకొక కక్ష్యకు మారుట మనము సాధారణముగా ఊహించు కొనేటట్లు జరగదు. అలాగ గెంతుతున్నప్పుడు ఎలక్ట్రాను రెండు కక్ష్యల మధ్యనున్న ప్రదేశాన్ని మామూ

లుగా ప్రయాణం చెయ్యదు; మధ్య ప్రదేశంలో ప్రయాణం చెయ్యకుండానే ఒక్క చోటునుంచి ఇంకొక చోటికి గెంతుతుంది. అంటే ఒక కక్ష్యలో మాయమై ఇంకొక కక్ష్యలో ప్రత్యక్షమౌతుంది. రెంటింటిమధ్య ప్రదేశంలో ఏ క్షణంలోనూ అగపడదు. ఈ గెంతు చాలా అద్భుతంగా ఉంది. ఎలక్ట్రానుయొక్క ఈ అంతర్ కక్ష్యా ప్రయాణం కూడా అనవరతంగా జరగక, గెంతుల మూలంగానే జరుగుతుంది.

పైవిషయాలలోనే కాక, ఆధునిక విజ్ఞాన శాస్త్ర మంతటిలోను వ్యాపించింది క్వాంటం సిద్ధాంతము. ఎలక్ట్రాను ఫోటాను వంటి మూలకణాల గతి, వాటి ప్రవర్తన తెలిసికొనుటకుగాను క్వాంటం యంత్రశాస్త్రము (Quantum mechanics) స్థాపింపబడింది. ప్రకృతి యొక్క ప్రవర్తనలో క్వాంటం సూత్రము మూలమైనది.

సమాజంలో మార్పులు క్రమేపీ అనవరతంగా రావాలి కాని, హఠాత్తుగా విచ్ఛేదంతో రాలే వని కొందరు రాజకీయవాదు వాదిస్తారు. ఆ అభిప్రాయంతో తమ పాలసీలను నిర్ణయించుకొంటారు. అవిచ్ఛిన్నత, క్రమత్వ అన్న పేర ఇంగ్లండులోని ప్ర త్వము కార్మికప్రభుత్వమై కూ గ్రీసులోను, కొన్ని ఇతర దేశా లోను రాచరికపక్షాలను బలప స్తూంది.

కాని, ప్రకృతి ప్రవర్తనల అనేక విషయాలు క్రమత్వా విరుద్ధంగా విచ్ఛిన్నతను చూ తున్నాయి. వాటిలో ముఖ్య నది క్వాంటం సిద్ధాంతము. ప్రకారం విశ్వంలోని ద్రవ్యం నైతేనేమి, శక్తిలోనైతేనేమి, చ నంలోనైతే నేమి అనవరతత్వ కాక ఏదో అననవరతత్వము, విచ్ఛిన్నత ఉన్నట్లు తెలుస్తూం మార్పులన్నీ గెంతుల మూలం జరుగుతాయని తోస్తూంది. కన సమాజంలో మార్పులు గెంతు ద్వారా విచ్ఛిన్నతతో ఒక్కసా రాగలవనే వాదనకు ఈసిద్ధాం బలాన్నిస్తూంది.

★

ఆలోచనలై నా మనస్సులో మెది
లేది. వింతవింత దృశ్యాలై నా
కనురెప్పలపై కదిలేది. ఇంతా జేస్తే
గడిచిన రోజులసంఖ్య బహు
స్వల్పం. నా ఐదువేళ్లూ దాటి
పోనేలేదు. సోమవారం, మంగళ
వారం, బుధవారం, లక్ష్మీవారం
శుక్రవారం. కాని ఆ కొద్ది రోజు
ల్లోనే నాకు లభించిన స్వల్పాను
భవంలో— ఆ రోజుల వరుస, అం
తంలేని విరుద్ధభావాల వింతఅల్లిక
లా కనపడేది. ఒక నిమిషంలో
ఆశ, ఆవేదన— మరొక నిమిష
ములో నిరాశ, ఆనందం. ఇల్లాగే
ఇదే విధంగా పరస్పర విరుద్ధ
భావాలునాగుండెలోగూడుకట్టేవి.
చచ్చినకోళ్లకి ఈకలుదుయ్యబోతే
చర్మం ఊడి వచ్చేదిగాని, అవి
మాత్రం ఎంత ఎగలాగినా ఊడి
రాక నానా అవస్థలు పడేవాణ్ణి.
సైకిలెక్కబోతే అది నా చుట్టూ
రివ్వున తిరిగి అడవి గుర్రంలా
మీద విరుచుకుపడేది. అది చూచి
నా యజమాని "ఏయ్ పోల్!
నువ్వెందుకు పనికొస్తావురా"
అంటూ కసిరేవాడు.

ఇప్పుడు వ్యవహారం కాస్త
కుదుటపడింది. పనులన్నీ పదిలం
గానే చక్కబెట్టేస్తున్నా. కోడి
ఈకలు వాటంతటవే తేలిగ్గా ఊడి
వచ్చేస్తున్నాయి. చెప్పినట్టు
వింటూ ఎటు త్రిప్పితే అటే
నడుస్తూ, సైకిల్ సాఫీగానే సాగి
పోతోంది. మొదటిరోజుల్లో,
కొట్లోకి వచ్చేపోయేవాళ్లందరూ
'ఏయ్, కుర్రాడా;' అంటూ ఎగ
తాళి చేసేవారు. ఇప్పుడో
అందరూ అసలు పేరేపెట్టి ఆప్యా
యంగా పిలవడం మొదలెట్టారు.
రెస్నిక్ మంచుపెట్టెలోంచి మేక
మాంసం తీసుకురమ్మంటే గొడ్డు
మాంసం కాక అదే, అతడన్నదే
తీసుకొస్తున్నా. అంటే, చెప్పిన
పనల్లా చెప్పినట్టే చక్కగా
చెయ్యగల్గే స్థితి కొచ్చాను.

త్వరలోనే చేసినపనికి, ఫలితం
రాబోతోంది—ఎనిమిది అమెరి
కన్ డాలర్లు! వాటిని ఎన్నో
వెండి నాణేలుగా మార్చి ఒక
పెద్ద కొట్టెలదుకాణాన్నే కొనేద్దా
మనిపించింది. మరో రెండు
డాలర్లు జేరిస్తే ఒక కొత్త సూటు
కొనుక్కోవచ్చుగదా అనుకున్నా.
టకొటిక్ మంటూ, దర్జాగా
నడుస్తూ, పెరీస్టోరులోకి పోయి
ఒక డాలర్ విసిరి వాడినుండు

పడేసి "సాల్ట్ బనానా జ్యూస్ బాటిల్ కావాలి" అంటూ సగర్వంగా అడగాలని ఎన్నాళ్ళనుంచో ఉబలాటపడుతున్నా.

ఇంతకీ రెస్నిక్ ఏరోజు జీతం ఆరోజునే యిస్తాడా? అంతా కలిపి ఏకంగా వారం ఆఖరున యిస్తాడా? అదంతా నాడూహ. అదేరకంగా అనుకుంటూ ఉండేవాణ్ణి. ఇప్పుడా బెంగే లేదు. ఇచ్చేది ఛెక్ అని తెలిసిపోయింది. ఆ ఛెక్ నే డాలర్లలోకి మార్చుకోవాలి. ఎక్కడ ఏవేళ మార్చుకోవాలో కూడా నాకు తెలుసు. మారిస్ ఫింకెల్ డ్రగ్ స్టోరులో. అక్కడే, ఆ షాపులోనే, నాతండ్రి ప్రతివారం తనకొచ్చే పదిహేను డాలర్ల ఛెక్ మారుస్తూఉంటాడు. అదీకాక ఆ చుట్టు ప్రక్కనే ఉన్నవాళ్ళందరూ మారిస్ మీంద నమ్మకంకొద్దీ అక్కడే చెక్కులు మార్చుకుంటారు. అందరికీ మారిస్ అంటే ప్రత్యేకమైన అభిమానం. అతనుకూడా అందరిలాగే అష్టకష్టాలు పడి అభివృద్ధిలోకి వచ్చాడు. అతని వెనుకటి జీవితం అందరూ ఎరుగున్నదే. చిన్నతనంలో, చినిగిన చొక్కాతో కాలేకడుపుతో కాళ్ళు యీడ్చుకుంటూ రుమేనియా నుండి వచ్చాడు. మొదటిరోజుల్లో, లాండ్రీలో చెమటోడ్చి చాకిరీ చేసేవాడు. రాత్రిళ్లు చదువుకునేవాడు. అల్లాగే పగలు పని చేస్తూ రాత్రి చదువుకుంటూ రసాయన శాస్త్రంలో మంచి ప్రావీణ్యత సంపాదించాడు. అంతటితో ఆగిపోలేదు. సంఘంలో తగిన స్థానం ఏర్పరచుకున్నాడు. అంతేకాక, రష్యన్, పోలిష్, జర్మన్, రుమేనియన్, యూదిష్ భాషలలో అనర్గళంగా మాట్లాడగలడు. ఇప్పుడందరూ అతన్ని డాక్టర్ ఫింకెల్ అని పిలుస్తారు. 'అబ్బే నేను డాక్టర్ నేమిటి ఏదో మందులమ్ముకునేవాణ్ణి' అంటూ అతనడ్డు తగులుకున్నా, అందరూ అతన్ని ఆప్యాయంగా అదే పేరుతో పంతంకొద్దీ పిలిచి తీరుతారు. అందరికీ అతనంటే అత్యంత ఆప్యాయత. అత్యంత నమ్మకం. ఎందుకూ ఆఖరికి అవి కూడా మందులవిషయాలైనట్టే కోర్టువ్యవహారాల్లోకూడా అతన్నే సలహాఅడిగి పరిష్కారం చేసుకుంటారు. అతనిచేతి చలవతో

ఏరకంమందు నీళ్ళిచ్చినా మంచం మీద రోగి మర్నాడే నడిరోడ్డు మీద నడుస్తుంటాడని వాళ్ళ దృఢ విశ్వాసం. అందుకే, అందరూ అక్కడే మందులు కొనుక్కుపోతూ వుంటారు. ఆ షాపులో అన్ని దేశాల మందులూ వున్నాయి. అక్కడ, ఒక్క వైద్యవిషయాలేకాక కుటుంబ విషయాలుకూడా చర్చల్లోకి చొరబడుతూ వుంటాయి.

కసాయిసాలనుండి రెస్నిక్ ఇంకా ఎప్పుడో · వస్తాడనగానే కొట్టంతా సర్ది శుభ్రం చేసి వుంచాను. గోడమీద గడియారంలో మూడు గంటలైంది. నాకూ, నా షేక్‌కూ మధ్య ఒక గంటకాలం వ్యవధిగా నిలబడివుంది. నిజంగా ఆ ఒక్క గంటే ఒక్క ఏడాదిలా వుంది. అందులో— అమెరికాలో— మొదటిసారి జీతం కోసం పడగాపులు పడ్డం, ఎవరూ ఏ మాత్రం ఓర్చలేరు. ఇంక ఆట్టేసేపు అక్కడే కాళ్లుముడుచుకొని కూచోలేక పోయాను. కాస్సేపు కొట్టంతా తిరిగి తనిఖీ చేద్దామనుకున్నాను. ఎక్కడా ఏలోపం లేకుండాచేసి రెస్నిక్ ఆదరాభిమానాల్ని పోకుండా చూసుకోడమే నా ముఖ్యోద్దేశం.

వెనుక వసారాలో చీపురుకట్ట పక్కనే కోడిఈక ఒకటి నా చూపుల్ని అడ్డుకుంది. ఉండే చోటుదాటి బైటికొచ్చి పడింది. నేలమీద అక్కడక్కడ రంపం పొట్టు కాలికి తగిలింది. తిరిగి తుడిచేసి గదంతా శుభ్రం చేశాను. మంచుపెట్టెమీద అద్దంలో నెత్తురు చుక్క మరోనిమిషంలో మాయమైపోయింది.

ఉన్నట్టుండి అమాంతంగా నా కళ్లు రెండూ ఒకే ఒక వికార దృశ్యంమీదపడ్డాయి. కిటికీరెక్కల పైన, కొక్కేలమీద వికృతంగా వేళ్లాడే కోడిపెట్టలజంట. వాటినేదోవిధంగా వదిలించుకోవాలనుకున్నా. అనుకున్నపని అవిఘ్నంగా నెరవేర్చేస్తే రెస్నిక్ ఎంత ఆశ్చర్యపడతాడో! ఉద్యోగంలో చేరిన మొదటివారంలోనే నా పని సొంతంగా, సానుకూలంగా నిర్వర్తించినట్టే. కొనే దిక్కులేక, నల్లగా మాడిపోయి వికారంగా వేళ్లాడుతున్న కోడిపెట్టల జంట వేపు మళ్లీ మరొకసారిచూశాను. అంతులేని అసహ్యం నా చుట్టూ నిలువెల్లా ఆవరించింది. ఎట్లా అమ్మ

తావో చూస్తాలే అంటూ ఎక సక్కెం చేస్తూ, ఆ కోడిపెట్టల జంట ఒక సవాల్ నా మీదికి విసిరింది. నా కందని పనికి పురి కొల్పింది.

కిటికీ వైపు నెమ్మదిగా నడుస్తూ కొక్కెం మీద ముళ్ల సంచీలా వేలాడుతున్న కోడిపిల్లని కుడి చేత్తో ఛటుక్కున పొడిచాను. కొక్కెంమీద కోడిపిల్ల రివ్వుమంటూ నా వైపుకే ఊగి నిర్జీవమైన గోళ్లతో నా ముఖాన్ని గీరింది. ఒక అడుగు వెనక్కి వేసి ఒక నిమిషంపాటు తమాయించి, అటూ యిటూ కోడి కదలకుండా ఒక స్థితికొచ్చిన తర్వాత చొరవ చేసి రెండో పెట్టని పొడిచాను. అదికూడా అదేవిధంగా మళ్లీతిరిగి అసువులు వసూలు చేసుకున్నట్టు రంయ్‌రంయ్‌మంటూ రెండు వైపులకీ ఊగసాగింది. కొక్కేలమీద కోడిపెట్టల జంట అటూ యిటూ అదేపనిగా అల్లల్లాడుతూ ఇష్టం వచ్చినట్టు ఊగేస్తోంది. నేనొక వీర కిశోరంలా రెండు పిడికిళ్లూ బిగించి ఒకదాని తర్వాత మరొక దాన్ని పొడుస్తూ, వాటి కెదురుగా వంగి నిలబడ్డాను. నావీరకృత్యం అప్పుడే అరడజనుమందిని ఆకర్షించి, తన చుట్టూ నిలబెట్టుకుందన్నవిషయం నే గమనించనే లేదు.

వచ్చే పోయ్యే బడిపిల్లలు బైట కిటికీ చుట్టూ మూగారు. నాకేసి నిర్ఘాంతపడి చూశారు. అంతా కలిసి ఫక్కుమన్నారు, కేకలేశారు చప్పట్లు కొట్టారు. కాళ్లతో నేల అదర తన్నేశారు. మళ్లీ ధైర్యం తెచ్చుకొని, పిడికిలి బిగించి, బలం కొద్దీ, సరిగా, సూటిగా గురిచూచి ఒక కోడిపెట్టను పొడిచాను. ఆ దెబ్బ కది కొక్కెంలోంచి ఊడి కిటికీ అద్దంమీద అదిరిపడింది. ఆ దృశ్యం చూస్తే వాళ్లకి నవ్వాగింది కాదు. అంతా కలిసి ఒక్కసారి గొంతెత్తి గొల్లుమన్నారు. వస్తాదుల కుస్తీలో మార్కులెక్కించే పెద్దమనిషిలా వాళ్లంతా ఒకటి, రెండు, మూడు అంటూ లెక్కపెట్టడం మొదలెట్టారు.

ఇంకేముంది. అంతలో అన్నీ మరిచిపోయాను. కొట్టు, చెక్, రెస్నిక్, నా ఉద్యోగం, సర్వం మరచిపోయాను. మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో సర్కస్ ఫీట్లు చేస్తున్నట్లే వుంది. ప్రపంచ విఖ్యాతిగన్న హైల్ మానొకడు

ఒకే క్షణంలో యిద్దరు ప్రతికక్షులను పడగొట్టడానికి సిద్ధంగా ఉన్నాడన్న మాట.

ఆఖరికి ఒక సర్కస్‌లా తయారైంది. కోళ్ళతో కుస్తీ మంచి పట్టులోనే వుంది. బైట జనం మీద ఇసకేస్తే రాలడం లేదు. తీవిగా లాటీ ఊపుకుంటూ ఎర్ర టోపీ అక్కడకే వచ్చి నిలబడింది.

పోలీస్ కూడా వచ్చాడే! వాడికేం సమాధానం చెప్పాలో! కాస్సేపు కోళ్ళతో కుస్తీ ఆపి ఆలోచనలో పడ్డాను. అంతలో అకస్మాత్తుగా రెస్నిక్ నా కళ్ళెదుట సాక్షాత్కరించాడు. అతని ముఖం వెర్రి భయంలో వెలవెల్లాడుతోంది. రెండు చేతులూ పైకెత్తి గిలగిలా కొట్టుకుంటూ, కొట్లోకి ఒక్కసారిగా ఎగిరి గంతేసి పడిపోవాలన్నట్టు కంగారుగా గుంపులోకి నెట్టుకుంటూ వచ్చాడు. ఎదురొచ్చిన ఎర్రటోపీకి తానే యజమానినని మొరపెట్టుకున్నాక రెస్నిక్ అతికష్టం మీద కొట్లో ప్రవేశించగలిగాడు.

"షోల్ ! ఏం జరిగింది ! ఎక్కడ జరిగింది?" గట్టిగా అరిచాడు.

ఏదో చెప్దామనుకున్నా. కాని నా నాలుక విపరీతంగా పెరిగి మొద్దుబారిపోయింది. నాలిక నోరంతా నిండి, ఒక్క మాటనైనా పైకి పెగిలిరానీకుండా చేసింది. అడ్డూ ఆపూ లేక, అదే పనిగా ఉక్కిరి బిక్కిరై ఊగిసలాడే కోడిపెట్టల వైపు వేలెత్తి చూపించాను.

"అయ్యో దేవుడా? ఏవిటి సంగతి? ఏమైంది చెప్పు?" రెస్నిక్ నా బుజాల్ని గుంజేస్తూ గట్టిగా అరిచాడు.

"అబ్బే ఏం లేదు. ఏమీ జరగలేదు. కోళ్ళతో ఆడుకుంటున్నా, ఊరికే ఇట్లా ముట్టుకున్నా నంతే" అధిక ప్రయత్నం మీద ఆ నాల్గు మాటలు నాలుక దాటి వెలికి వచ్చాయి.

కొక్కేల మీద కోడిపెట్టల్ని తనిఖీ చేస్తూ, అనుమానం ఆవరించిన వాడి చూపుల్ని నా ముఖం మీదకి వదిలేడు. చికాకుతో రెస్నిక్ బుజాలెగరేశాడు. నిట్టూర్పులు విడిచాడు. రెండు చేతులూ పైకెత్తాడు. అన్నీ ఒకేసారి, ఒకే క్షణంలో చేసి ముగించాడు. పోలీస్ ఈ విడ్డూరం చూసిచూసి

విసుగెత్తిపోయి గుంపుని చెదరగొట్టడానికి పోయాడు.

రాబోయే నాదీనావస్థకు సూచకంగా రెస్నిక్ అరచేతిలో గడ్డాన్ని ఆనించి ఆలోచించసాగాడు. ఒక నిమిషం నడిచిపోయాక, రెస్నిక్ చెయ్యి క్రిందవాల్చినవిధం చూసి నా ఉద్యోగం ఊడిపోయిం దనుకున్నా. గొడ్డలెత్తేసినట్టయింది.

ఎనిమిది డాలర్లకి చెక్ వ్రాసియిస్తూ "శనివారం రాత్రికి నీవు పనిలోకి రానక్కర్లేదు లే. నువ్వీ నౌకిరీ చెయ్యలేవు. ఫ్యాక్టరీలో జేరి ఏదో ఒక పని నేర్చుకో" అన్నాడు.

కిటికీయెదుట కొంతమందిజనం నిలబడి, వాళ్ళకున్న ఉబలాటాన్ని పూర్తిగా వినియోగించి వింతగా నా విషాదపరిస్థితిని చూస్తున్నారు. వాళ్ళలోనే ఒక ఆడమనిషికూడా వుంది.

రెస్నిక్, కోడిపెట్టల్ని మంచు పెట్టెలో దాచివేయడానికి సిద్ధంగా వున్నప్పుడే, ఆ ఆడమనిషి తలుపులు తెరుచుకుంటూ లోనప్రవేశించింది.

"అమ్మకానికేనా యీకోళ్ళు?" ఆమె గొంతెత్తి హెచ్చుస్థాయిలో ప్రశ్నించింది.

"ఆ! ఆ! అమ్మకానికే" రెస్నిక్ ముఖం పెద్దచాటంతఅయింది. "ఏదోధరచేసిమీకేయిచ్చేస్తాను" అంటూఆమె మళ్ళీమనసు మార్చుకోకుండా కోడిపెట్టల్ని త్రాసులో పెట్టాడు.

అతడుచెప్పినధరనే ఆమె అంగీకరించింది.

"సోల్! త్వరగా ఒకపెద్దసంచీ తీసుకురా! త్వరగా" రెస్నిక్ ఆజ్ఞాపించాడు.

ఛటుక్కున లోపలికి పరుగెత్తి క్రింద బోర్లపడకుండా ఆపుకుని సంచి పట్టుకొచ్చాను. ఆడమనిషి డబ్బుచెల్లిస్తూ నావైపుతిరిగి నావీపు తట్టుతూ "నీవెంతో చురుకైన కుర్రాడవు. వచ్చేపోయేవాళ్ళని కొట్లోకి రప్పించితీరుతావు. ఆదివారంనాటికి మేకమాంసం కొనుక్కు పోదామని బైల్దేరేను. కాని ఇందాకటినుంచీ నిన్ను చూస్తూ, దానికి బదులుగా కోడిపెట్టలే కొందా మనుకున్నా" అంది.

రెస్నిక్ విజయగర్వంతో నొసలాడించాడు. తలవని తలంపుగా తటస్థించిన యీ అమ్మకంలో తనుకూడా ఒక భాగస్తుడే

అనుకున్నాడు. ఇంతకీ నేనతనివద్ద పనిచేసే కుర్రాణ్ణి, అంతేగా!

అక్కణ్ణుంచి ఆ డ మ ని షి అంతర్థానమైనాక రెస్నిక్ నావైపు తిరిగి "సరే ఇంతవరకు బాగానే జరిగింది. సోల్! మళ్లీ నీకు మరో అవకాశం యిస్తున్నా. మరెప్పు డైనా కోళ్ళను పొడిచేటప్పుడు వాటి మెడ మాట జ్ఞా ప క ం వుం చు కో. ఇప్పుడొచ్చినామె మంచిమనిషి కాబట్టి సరిపోయింది. అదేకనక యూదుస్త్రీ అయితే ముఖ్యంగా మెడమైపే చూస్తుంది. వాళ్ళకదే ఎక్కువ అవసరం. తెలిసిందా!" అన్నాడు.

"సరే. అల్లాగే; జాగ్రత్తగానే చూస్తా" అంటూ సెలవడిగి వెళ్లి పోయాను.

ట్రాలీ కారు మీద పోతూ చెక్ మాట జ్ఞాపకంవచ్చి జేబులో చెయ్యిపెట్టి చూశాను. అది అక్కడే వున్నచోటనే వుంది. నిజంగా రెట్టింపురాఖం ముట్టినట్టే అనిపించింది.

ప్రాగ్భూమి

దాశరథి కృష్ణమాచార్య

పడమటి బొల్లిగద్దలు
పొడిచి పొడిచి తిని విడిచిన
అగ్ని సంస్కారం నోచని
నగ్న శవం ప్రాగ్భూమి.

కరువుల తెరచాటున
మరణాంగనాలింగనంలో
కనుమూసిన నిరుపేదల
ప్రణయశాల ప్రాగ్భూమి.

మతాలతో, గతాలతో
చితిరగిల్చి పడిచచ్చే
అన్నాదమ్ముల చల్లని
కన్నతల్లి ప్రాగ్భూమి.

తీగవిడిన దివ్యవీణ,
మూగవడిన నాగస్వరం,
కదలని వదలని అంతః
కర్దన పథం ప్రాగ్భూమి.

బూజెక్కిన కీలుబొమ్మ
రాజులపై జోజు పూసి
తాజాగా అమ్మే అంగడి
బాజారిది ప్రాగ్భూమి.

లక్షలాది పేదల ప్రాణాల్
అక్షింతలుగా జల్లుకొన్న
లక్షాధి కార్ల పాలిటి
లక్ష్మీదేవి ప్రాగ్భూమి.

ఖైదీ గీతం

★

అనిశెట్టి సుబ్బారావు

ఎంత చక్కని కనులు ఈ రాత్రి విప్పినది
ఎంత చక్కని కాంతు లీరాత్రి పంచినది !

కారడవులే శిరము లెగసి పులకింపగా,
ఇసుక గుట్టల యెడారుల రొమ్ములే పొంగ
ఎంతచక్కని కాంతు లెంత చక్కని కనులు!

పసరు బాలింత మొగమెత్తి నవ్విన తృప్తి
భూమాత కీనాడు!

గాఢనిద్రలో శిశువు పెదవి పూచిననవ్వు
లేదు నాగుండెలో!

భూమాత యుగ యుగమ్ములు గన్న కలలకై,
భూమాత యుగ యుగమ్ములు విన్న పిలుపుకై
పసి పరుగు లెత్తు నాకడకు—

భూమాత రొమ్ము కుమ్మిన ద్రోహులే వచ్చి
ఇనుప కమ్ముల చట్రాలు కిందికి త్రోసి—
ఎడలేని తారు గోడల మధ్య నా బ్రతుకు!

ఇనుమునే తవ్వినది, పోతనే పోసినది
కడలేని గోడలు, పొడలేని తారు
కట్టాను నేను, కాచాను నేను!
సర్వ శాస్త్రవిజ్ఞాన మొక్క రాక్షసి యాచు
బంధించినది నన్ను!

ఎడలేని తారు గోడల మధ్య నా బ్రతుకు!
ప్రాణ నృత్యోత్సవామృత సుఖము బైట—

కడలేని చీకట్లదుముకొన్న కూపమిది—
నావలెనె!

ప్రాణ ముక్కిరి బిక్కిరైన పసిగాలి
మూర్ఛిలి పడిన దిచట,
కనుగాన కలిసి పెనగిన కిరణ
మురి వేసుకుని పడిన దిచట!

మానవ హృదయాన మండు గాయమ్మిదే!
జగతిలో మంచికిది కొలబద్ద!
జగతి దుఃఖాని కిది చలివేంద్ర!

... ...

ఓహూ హూ!
హొరాయ లెగయు హేమ గోపురములతో
నిద్రించు శిలల దేవతలో!
ధగ ధగని వెల్గు దీపాలతో
నిర్జీవ దేవ విగ్రహములో!
గర్భ గుడిలో!

మథనమై నాహృదయ ముత్పాతమై పెరిగి
శిథిలమై ఈ దగాసత్య పీఠాలన్ని
ముంచెత్తి ఊడ్చుకొని పోదా!

... ...

నాడు ప్రాణమె నవోదయ మూర్తియై లేచు!
ఆవేళ జగతి నా అతిథియై
దోసిళ్ల నెత్తి సర్వము వేడుకొన, వచ్చు!
నాడు నామనసూగి కరుణయై కడలియై
మణుల హస్తాలెత్తి వెల్గించు జీవ పథముల్!
ఆవేళ అణువులో, అనంతములో
నాకనుల కాంతినిండు!
నావాక్కు ప్రాణ మిచ్చు!

నీటి పంపకం

★

శ్రీ కె. వి. కృష్ణమూర్తి

'ఒసే, లచ్చీ, రెండుగంటలు పొద్దోయింది. తిరిగి తిరిగి నాలు కార్చుక పోతుండాది. ఇసిన్ని నీళ్లియ్యవే, తాగనానికి' అని అడిగాను

'ఏం, నాన్నా, పొలానికి నీరొస్తదా? ఏటయింది. ఎవ్వారం?' అని ఆదుర్దా పడతా అడిగినాది లచ్చి, నీళ్లిస్తూ.

'ఇంకేటయ్యేది. ఈసారికూడా పంట నష్టమే. ఎంకడేడీ?'

'బాబయ్యా, పొల మెలాగుండాది' అని అడిగాడు ఎంకడు.

'నారు పోయడానికెప్పుడెళ్లేది బాబయ్యా?' అని అడిగినాది లచ్చి.

'నారేటి పోసేది! గడ్డపారేస్తే ఖంగుమంటా ఉంది బూంవి' అన్నా

నిజంకూడా అంతే. గడ్డపారేస్తే ఖంగుమంటా ఉండాది, నీటిచుక్క లేదాయె—ఎండిపోయింది. ఈపాటికి బట్టిలో గనక నీరొస్తే బూంవంతా చింష చింవ మంటా ఉండాలిసింది. బట్టిలోనే నీరు కొంతకొంత వస్తుండాదాయె. చిట్టచివరి నా పొలానికి ఎక్కడందుతాది? పోయిన సంవత్సరం పలాసా, మందసాల్లో కరువొచ్చి మనుషులు పురుగుల్లాసచ్చి పొయ్యారన్నారు. మాగతికూడా అంతే కావాను ఈసారి. దగ్గరున్న కుమరాడ చెర్వు గర్భం మెరకపడి చెరువులోకే నీరు రావడం లేదు. ఆవచ్చిన నీరుకూడా తూముల్లోంచి పొలాల్లోకి పారడంలేదు. తూమును మరమ్మత్తు చేయమని ఓవర్సీరుకి దరఖాస్తు పెట్టుకుంటే, 'అదిగో, ఇదిగో' అంటూ మూడేళ్లు గడిపాడు.

ఇంకేటిరా గతి అని అనుకుంటూంటే, ఇద్దరు ముగ్గురిని ఎంటబెట్టుకుని పుల్లయ్య, కఱ్ఱలతోటి బట్టియేపు పరుగెత్తుండాడు.

'యాడికోయి, ఈ పరుగు, కఱ్ఱలతోటి?' అని అడిగా.

'ఇంకా యాడికేటి కుమరాడ బట్టి కాడికి—ఎంకటాపురం రైతులు బట్టికడ్డంగా పూను ఏశారంట. ఆ

పూను పూనులాగే ఉంటే - మన నోట్లో మట్టే. ఇయ్యాల బుజ్జిలు పగలాలిసిందే'

'ఆఁ, ఏటి? వాళ్లెవరోయి పూనెయ్యడానికి. మనంఎల్లి ఓవరు సీరుతో సెబుదాంరా'

'ఏడ్సినట్టే ఉంది. కంచే చేను మేస్తే - ఇంకది కాచే కాపేటి? ఏటి? ఓవరుసీరే ఏయించినా డుంటవా?'

బట్టీ = కాలువ
పూను = కాలువ నీటికి పెట్టిన అడ్డం.

'ఇంకాఅనేదేంది మొన్న రాత్రి ఎంకటాపురంలో పెద్దరైతు రామ స్వామి ఇంట్లో ఓవర్ సీరుకి యిందు సేశారు. యినలా - యిదయిం తరువాత అప్పలమ్మ పాటకచ్చేరి చేసింది కూడాను. మరి ఊరికేనను కుండవా?

'ఏటి? యీడి దుంపతెగా? ఆ బాబే యేయించిండూ పూను? ఆఎంకటాపురం రైతులు పసేటో సూశెయ్యాలి. పదరా ఎం కయ్యా, నారయ్యా పదండి. ఏం పుల్లయ్యా, ముసిలోళ్లం మనంమటుకే ఎడితే ఎలాగు - వడుచోళ్లని తీసికెళ్లొద్దూ?' అన్నా. అందరం కఱ్ఱలు తీసుకు బయలుదేరాం.

పెద్ద బట్టిలోనుంచి, మా రెండు గ్రామాలకు, అంటే కుమ రాడ, ఎంకటాపురం గ్రామాలకు కలిపి ఒకపాయ చిన్నబట్టి వస్తుంది. పేరేమో, కుమరాడబట్టి అనేకాని, కుమరాడ ఎంకటాపురం రెంటికి నీరి స్తుందీబట్టి. ఇదే రెండు పాయలు గా చీలి కుడిపాయ ఎంకటాపురం పొలాలకు, ఎడంపాయ కుమరాడకు నీరెడుతుంది. ఈ పాయలయ్యే జాగాలో రెండు గ్రామాలకు సరిగా పంపకంచేసే ఎత్తు ఏదయినా కట్టితే ఏ తగూ లేకపాయె. ఎత్తు కట్టం డోయి అని ఎన్ని అర్జీలు పెట్టు కొన్నా. ఓవర్ సీరు బాబు యినడు. ఎందుకో అర్థంకాకుండా ఉండాది. నాకు అర్థం కాకపోవడమేట్లో, అయిందనే సెప్పాలి, కాబట్టి, ఏప క్కరైతులు పల్లంచేస్తే ఆపక్క ఎక్కువ నీరు పారడం రెండో ఊరికి నీరు లేకపోవడం నీటికోసం కొట్టు కోవడం, ఇది మామూలయి పోయినాది మాకు.

బట్టి రెండు గాచీలేది, కుమరాడ రోడ్డు పక్కనే. ఆడి కొచ్చేకాడికి యింకేటి సెప్పేది. రెండువైపుల,

కత్తులు, కటార్లు తీసుకొని రెండు గ్రామాల రైతులు నిల్చుండారు. మధ్యలో ఓవరుసీరు గుమాస్తా ఉన్నాడు. కుమరాడకు నీరురాకుండా బట్టిలో పూనేసి, అంత నీరు ఎంకటాపురానికి తిప్పుతున్నారు ఆవూరి రైతులు. 'నరసయ్యాపూను తీసేస్తావా మరియాదగా, లేక...?' అన్నాడు మాపుల్లయ్య:

'లేక...లేకపోతే, పీక తీసేస్తావా ఏటి? ఏటినీమాటలు- సరిగ్గారాని య్యి' అన్నాడు నరసయ్య:

'పీక తీసేదేటి? నువ్వు తీసెయ్య గలవా ఏటి? పూను తీసెయ్యి మరియాదగా, అన్నాడు పుల్లయ్య. 'మాపొలాలెండిపోతుండయి పొలా లెండిపోతే మాపానాలెండి పోయా యన్నమాటే, మేం తీసెయ్యం" అన్నారు ఎంకటాపురం రైతులు.

'మా పానాలు మటు కెండి పోడంలా ?... మీలాంటి పొలాలే మాయీని' అన్నారు కుమరాడ రైతులు :

'అవునోయి - పుల్లయ్యా - పాపం, నరసయ్య పొలం పూర్తిగా ఎండిపోతుండాది. పాపం, పూనేసు కోనీ' అన్నాడు. ఓవర్ సీరు గుమాస్తా.

'పెద్ద తీర్పుతీర్చావు బాబయ్యా అసలు బట్టిలో నీటికెందుకు కరు వొచ్చిందీ? మొగ పూర్తిగా ఎందుకు తెరవాలే? పెద్దబట్టిలో నీరు పూర్తిగా పారుతుంటే. మా బట్టికి నీరు కరువేటి? అసలు నీరుకట్టేసి, పూనేసుకోమని సలహా ఏటండీ?' అన్నాడు మా ఎంకడు.

'ఏయ్ జాగ్రత సరిగ్గామాటలు రానియ్యి. లేకపోతే ఏంజేస్తానో చూడు' అని గుడ్లురిమి చూశాడు గుమాస్తా.

ఇంతలో మా పుల్లయ్య తన కఱ్ఱతో పూనును కదిపాడు.

నరసయ్య కొట్టడానికి కఱ్ఱ పైకెత్తాడు. అందరికఱ్ఱలు పైకెళ్ళినయి. గుమాస్తాకు భయమేసిందికాబోలు చప్పున పరుగెత్తుకు ఎళ్ళిపోయాడు. ఆయన ఎల్లిపోగానే ఓవర్‌సీరుబాబు ఎల్లిపొయ్యొచ్చిండు రంగమ్మానికి.

'ఏమిటోయి, సింహాద్రీ, అప్ప న్నా, పుల్లయ్యా, నరసయ్యా, మీలాంటి పెద్దలుండికూడా, ఇలా కొట్టుకోడానికి పూనుకుంటే, ఇంకెలాగోయ్. ఏదో కరువురోజుల్లో నీరు ఎలాగోఅలాగు పంచుకోవాలి

కాని...' అన్నాడు.

'అవును, బాబూ, మా గుంట లబ్రతుకులన్నీ దీనిమీదే ఉండయి, బాబయ్యా, అందుకని ఇంతగొడవ' అన్నా నేను.

'అయితే, ఏమిటి, ఎంకటాపురం రైతులకు నీరియ్యదలచుకో లేదా మీరు?' అన్నాడు.

'మే మెవళ్ళం నీరిచ్చేందుకు. నీరిచ్చే పెబువులు మీరు. మీ రాళ్ళకే యియ్య దలచుకొన్నారు. మరి మా కియ్యరా' అన్నాడు పుల్లయ్యా.

'మీరూ తీసుకొందురు గాని లేవోయ్. ముందు వాళ్లనికానీ.'

'అదేటిబాబూ, అవసరం గడిచి పోతే మాకు మటు కెందుకు?'

ఎన్నెన్నో సెప్పి సూశాడు మాకు ఓవరుసీరుబాబు వాళ్లకు నీరిద్దామని. ఊఁ హుఁ. మా ఓళ్లీ నలా. ఆయనకు కోప మొచ్చింది.

'ఏమిటోయ్. యిలా దెబ్బ లాడుతున్నారు. ఈ నీరు మీ తాతల సొత్తనుకున్నారా?'

'లేదుబాబూ, మీ తాతసొత్తే నని మాకు తెల్సు' నన్నాడు ఎంకడు.

'అఁ. గుంటవెధవా! ఎంత మాటన్నావు, మా తాత సొత్తూకాదు మీ తాత సొత్తూకాదు. సర్కారుది ఈ నీరు. నా యిష్టం వచ్చినట్టు పంచుతాను.'

'సర్కారుదేలాగయినాది బాబూ. దేవుడిచ్చిన నీరు. 'నాగావళి' లో నీరు మాదా సర్కారు పుట్టించిందా ఏటి? మాదగ్గర బూమి శిస్తు కాసక నీటిశిస్తుకూడా తీసు కుంటున్నారే సర్కారు. శిస్తుకు శిస్తూ తీసుకొని, నీరుకు నీరూ యీయకపోతే యింకేటి?' అన్నాడు. పుల్లయ్యా.

'ఏడిశావ్. సర్కారుని తిట్టుతున్నావు. జాగ్రత. తాసిల్దారుతో చెప్పి, జరిమానా వేయిస్తాను. పోలీసు యినస్పెక్టరుతో చెప్పి మీరు కఱ్ఱలతో కొట్టడానికి వచ్చి నట్టు కేసుపెట్టిస్తాను' అని ఎగిరాడు ఓవరుసీరు.

రెండు పక్కలోళ్ళు పట్టుదలగానే ఉండారు. రెండుపట్ల కోప మెక్కువై పోతుండాది.

ఓవరుసీరు దబాయింపు నెగ్గలా

మా ఎంకడూ, మరికొందరు గుంటలు కలిసి, పూను తీసేశారు

ఎదిరోళ్ల కఱ్ఱలు గుంటలనెత్తిమీద బడ్డాయి. మా ఎంకడి నెత్తిమీద గాయం తగిలింది. మావోళ్ళు కూడ కొట్టడానికి ఎగబడ్డారు. సుతిమించి పోయింది నా మనసొప్పలా. ఈ ఓవరుసీరు మూలాన మేం మేం కొట్టుకు సస్తుంటే దూరంగా నిలబడి సిత్రం చూస్తా నిలబడ్డాడు. ఒక యేడటు, ఒక యేడిటు తీసి మా కొంపలు కూలుస్తుంది యీడేగదా అనుకున్నా. వెంటనే రైతులమధ్యకు తోసేసుకొని ఎళ్లిపోయా. ఇద్దరిని యిసింతనెట్టి,

'ఓరప్పన్నా, మాదన్నా సూడండ్రా. ఎవరికి గాయాలు తగిలేది? మన కఱ్ఱలు మన బుఱ్ఱలు పగలకొడ్తుండయిరా. పెబువులు పెబువులుగానే ఉండారు. పోయిన సంవత్సరం మా వూరి పెద్దరైతు కాడ లంచం దీసుకొని మీకు అన్యాయం సేసి, నీరు మావూరికి తిప్పాడు ఈ ఓవర్‌సీరు. మరచిపోయారంటరా. ఈసారి మీ పెద్దరైతు వీరయ్య కాడ లంచం దీసుకున్నాడు కామోసు. మాకన్యాయం సేయడానికి పూనుకున్నాడు. మనమందరం యిలా పెబువులకు లంచాలిచ్చి, మన బుఱ్ఱలే పగలకొట్టుకుంటూ ఉంటే ఇంకేం బతుకురా. రైతూ, రైతూ ఒకటి. మొన్న పోలీసు యినస్పెక్టరు మీవూరి రైతులను బాదాడు వారుఫండిమ్మని మావూరి రైతులనూ బాదాడు. మరచిపోయారంట్రా. మన అందరి పొలాలు ఒకలాంటివే. మన కందరికీ నీరు కావాలి. అన్యాయంగా మాటాడితే ఎట్లా' అన్నా నేను.

దీంతోటి కొంతకాలపోతే కొంతవేడి అణిగింది. మా రైతులు కఱ్ఱలుదించి వింటుండారు. వెంకటాపురం రైతులు గూడా నిమ్మళించి వాళ్ళలో వాళ్ళు సంప్రదించు కుంటున్నారు.

'నీవు సెప్పేది సరేనోస్. మాకు నీరు కావాలి. పూనెయ్యక మాన' నన్నారు వెంకటాపురం రైతులు.

'అయితే. నే నొకటి సెపుతా యినండి. అన్నిటికంటెముందు మన రెండూళ్ళ రైతులు ఒకమాట మీద నిలవాలి. ఆమాట పెకారం సెయ్యడానికి ఉత్తరువు ఓవర్‌సీరు బాబు నడుగుదాం'.

'సరే' నన్నారు వెంకటాపురం రైతులు.

'సూడండ్రా. మీరు ప్లాను ఈ రేతి రేసుకోండి. ప్లానుకు దిగవ బట్టిలో మేం గండేసుకుంటాం. పగటి పూట మా మూలుగా రెండూ తీసేద్దాం సరేనంట్రా? "అని అడిగా.

"బలే బాగుంది" అన్నారు మా కుమరాడ రైతులు.

'సరే'నన్నారు. వెంకటాపురం రైతులు. దూరంగా నిలబడ్డాడు ఓవర్సీరు. కొట్టుకోడంలేదని దుఃఖ పడతా మాకాడికే వచ్చాడు.

'ఇలా నే సేనే' మనకు తగువు నేకుండా పోతాది. వేరే మార్గం లేదురా. ఏమండీ ఓవర్సీరుగారూ! అలా సెయ్యనియ్యండి మమ్మల్ని' అన్నా.

ఓవరుసీరుకు ఏటి సెప్పడానికి తోచలా. రెండూళ్ళ రైతులు ఒకటయ్యేతలికి ఆయనకు బయమేసి నట్టుండాది.

'ఆఁ, అలా వీల్లేదు. మా రూల్సు ఒప్పుకో' వన్నాడు.

'రూల్సు గీల్సు మాకు తెలియదు. మేం రైతులందరం ఒప్పుకున్నాం. మే మలాగే సేసి తీర్తాం. మీరూ ఒప్పుకోవాలి' అన్నాడు ఎంకడు.

'నే నొప్పుకొంటే సరిపోయిందా ఏంటి? రేపు పొద్దున్నే కరణం వచ్చి కేసు పెడతాడు చూసుకో'అన్నాడు

'కేసు గీసు అని, కరణంగాని, మునసబుగాని, మాదగ్గరకు గాని వచ్చారా......యిదిగో...' అని రెండూళ్ళ రైతులు సేతుల్లో కఱ్ఱలు సూపించారు ఓవరుసీరు బాబుకు.

'మీ యిష్టం వచ్చినట్టేడవండి' అని వెళ్లిపోయినాడు ఓవరుసీరు— అతనితోటి, అతని గుమస్తాకూడా.

యుద్ధం తప్పింది; కాని ఓవరుసీరు లంచాలు పోతయ్యని అనుకున్నాడేమో మొహం మాడ్చుకుని పోయాడు.

మా మా యిళ్లకు రైతులం వచ్చేశాం.

ఒప్పుకొన్న పెకారం ఎంకటాపురం రైతులు ప్లానేశారు. రేతిరి దానికి కూంత దిగవ మేం గండీ కొట్టాం. ఆరేతిరి, రేతిరి నారేసు కోడానికి రెండూళ్ళ రైతులు పొలాని కెళ్లి, పొలానికి నీరెట్టుకున్నాం. వాళ్ళకు నీరు సాకపోతే మేలం గండీ తీసేశేటోళ్లం. మాకు నీరు సాలకపోతే వాళ్ళు ప్లాను తీసేశే

(మిగతా 60 వ పేజీలో)

మా భూమి

రచయితలు

సుంకర సత్యనారాయణ

వాసిరెడ్డి భాస్కరరావు

ప్రజాశక్తి ప్రచురణ : వెల – రూపాయి

ఈ నాటకం నైజాం సంస్థానంలోని పై వర్గాలకూ, ప్రజలకూ మధ్య జరుగుతున్న సంఘర్షణను చిత్రించాలని ఉద్దేశించబడింది. ఈ ఉద్దేశ్యాన్ని ఈ నాటకం ఎంతవరకు నెరవేర్చిందన్న ప్రశ్న పాఠకులనూ, ప్రేక్షకులనూ బాధిస్తుంది.

నైజాం సంస్థానంలోని ప్రజలు నేడు క్రూరంగా పైవర్గాలచేత హింసించబడుతున్నారు. నిత్య దారిద్ర్యంతో మధ్యయుగాలనాటి బానిసత్వంలో మ్రగ్గుతున్నారు.

బ్రిటిష్ దాస్యంనుంచి బయట పడాలనే సోదర భారత ప్రజల జాతీయ పోరాటంనుంచి ఉత్తేజం పొందిన సంస్థాన ప్రజానీకం తాము తరతరాలుగా అనుభవిస్తున్న దుర్భర దాస్యంనుంచి, క్రూర నిరంకుశ పరిపాలననుంచీ విముక్తి పొందాలని ముందుకు దూకుతున్నారు.

జాగీర్దార్లు, దేశముఖులు పటేల్ పట్వారీలు పెట్టే నరకయాతనలను ప్రతిఘటించడానికి ప్రజాఉద్యమాలను నిర్మించుకొంటున్నారు నూతన జీవిత నిర్మాణానికి పునాదులు వేస్తున్నారు. ఈపవిత్ర కర్తవ్యంతో ఎందరో వీర యువకులు యువతీమణులు ముందుకు వచ్చి, తమ సర్వస్వం బలిదానం చేసి, ఉజ్వల భవిష్యత్తుకు దారి తీస్తున్నారు.

'మా భూమి' నాటకం ఈవాస్తవాన్ని చిత్రించవలసి వుంది. కాని, ఈ నాటకం పై వాస్తవాన్ని ప్రదర్శించడం మాట అటుంచి, దానికొక వికృత స్వరూపం కల్పించింది నైజాం సంస్థానప్రజలు సాగిస్తున్న నేటి జీవిత పోరాటం తమదిగా భావించే సోదర ప్రజానీకంయొక్క రాజకీయ చైతన్యానికి ఇది 'జోలపాట' పాడుతుందే కాని, దానిలో ఎంతమాత్రం ఉత్తేజం కలిగించదు. మాక్సిం గోర్కీ చెప్పినట్లు సాహిత్య ప్రయోజనం ఉత్తేజం కలిగించడమే కాని, జోల పాటపాడి లాలించడం కాదు. ఈనాటకములో ప్రదర్శించబడిన వస్తువైఖరులను చూస్తే, ఈ సంగతి తేలిపోతుంది.

ఇందులో మొదటి రంగంలో బందగీ సమాధివద్ద ఏవో సమస్యలజాబితా వల్లించి కథానాయకుడు వీరారెడ్డినగ్రామసంఘం పెట్టుకోవాలనుకుంటారు. దీనికి దేశముఖు గూండా మస్తాను దేవరస్త్రీని ఎత్తుకుపోవడం, త్రాగుబోతులు వీరారెడ్డి చెల్లెలు కమలను 'వెంకమాంబజేబి' దుర్భాషలాడడం - ద్రోహం చేస్తాయి. దాంతో

ఏర్పడ్డ సంఘం సంగతి రెండో రంగంలో దేశముఖుకు తెలిసే లోపలే, అంటే మర్నాటి ఈ మధ్యనే, ఊరూ గూడెం ఏకమై ప్రజలంతా ఒక్క కట్టుమీద వుంటారు. దేశముఖు మండిపడి, యల్లమందను, పిలిపించి, సంఘంవాళ్ళు లెవీ కట్ట వద్దన్నారని వ్రాసి బలవంతంగా వేలుముద్ర వేయించుకుంటాడు. వీరారెడ్డి వగైరాలనుపిలిపించి లెవీకోసం ఒత్తిడి తెస్తాడు మూడోరంగంలో మస్తాను కోడిపిల్లల కోసం గూడెం వెళ్లి దెబ్బలు తినివస్తాడు. దేశముఖు మనుషులు రామిరెడ్డి గిత్తను దొంగతనంగా గడీకి తోలుకుపోతారు. కాలునిలవక దేశముఖు పట్వారీలుపోలీసు సహాయంకోసం పట్నంపోతారు. నాలుగో రంగం ఈ మధ్య ఎక్కడో మీటింగు జరిగినట్లు తెలిసి నాలుగోరంగంలో దేశముఖు మండిపడి పోలీసు బలగం వస్తున్న దన్న హామితో జబర్దస్తీగా పట్వారీ ముందు చిందులు దొక్కుతూ వుంటాడు. వచ్చిన పోలీసు అమీనుకు ఎనిమిదివేలు ముట్టజెప్పి, వాణ్ణి లాలించి బుజ్జగించి, ప్రజల్లో కులతత్వాలు రేచ్చగొట్టాలనే 'తిరుమంత్రం' నేర్చుకుంటాడు. అమీన్ మహమ్మదీయులనూ, దేశముఖు జగన్నాధరెడ్డి వీరారెడ్డినీ తిరగదియ్యాలని చూసి విఫలులవుతారు. వెంటనే వీరారెడ్డి అరెస్టు ఇక అయిదో రంగంలో రామిరెడ్డి యల్లమందలు దేశముఖు మనుషుల్నితన్ని మళ్లీ గిత్తను తోలి తెచ్చుకుంటారు. వీరారెడ్డి ఇంట్లో అతని అనుచరులూ, భార్యసీతమ్మ చెల్లెలు కమల – అందరూ ఇష్టాగోష్టి మాట్లాడుతూ, మధ్యలో జ్ఞాపకం వచ్చి 'ఆత్మరక్షణ' నేర్చుకోవాలని అప్పుడే అక్కడే లేచి నిల్చుంటారు. ఇంతలో అరెస్టువార్త తెలుస్తుంది. పోలీసులు దాడి చేస్తారని కూడా తెలుస్తుంది. వెంటనే గ్రామాన్ని ఆత్మరక్షణకు పురికొల్పడానికి వారు నలుమూలలకూ వెళతారు. ఇంటివద్ద సీతమ్మ కమలలుంటారు. కమల వడిసెల తీసుకొని ఇంట్లో బల్లమీద నిలబడుతుంది; సీతమ్మ 'నవ్వుతూ' రాళ్ళందిస్తానని చక్కనే క్రింద నిల్చొని వుంటుంది అన్నయ్య లేడుగదా అని మనింటికే వస్తారేమోనని కమల అనుకున్నట్లూ 'సరే గాని నీవుమాత్రం కాస్త జాగ్రత్తగా ఉండమ్మా వాళ్లసలే కోతిముండాకొడుకులు' అని సీతమ్మ అన్నట్లూ–పోలీసులు తలుపుకు అడ్డంపోయిన సీతమ్మను నెట్టేసి రానే వస్తారు' దేశముఖు 'చిక్కక ఎక్కడికి బోతావులే పిల్లా' అంటూ 'గుడ్లురుముతూ' కమలమీదికే వస్తాడు. సీతమ్మ రోకలి దెబ్బతో పడిపోయిన దేశముఖును రక్షించడానికి వచ్చే పోలీసులు కమల కారం కొట్టడంతో అల్లకల్లోలమై పోతారు. ప్రజల జయజయధ్వానాలతో బెదిరిపోయి, అమీన్ అప్పుడే వచ్చి పట్వారీని కొట్టిన దాదాను కాల్చేస్తాడు. మరో గుండు ప్రేల్చితే అది తగిలి సీతమ్మ పడిపోతుంది దేశముఖు వగైరాలంతా పరారై పోతారు దేశముఖు నౌకరు మంగలిరాముడు విడిపిస్తే వచ్చిన వీరారెడ్డి దాదా సీతమ్మలను తుదిచూపు చూస్తాడు.

ఆరో రంగంలో, దాదా సీతమ్మల సమాధుల దగ్గర వీరారెడ్డి వగైరాలు కూడి మాట్లాడుకుంటూ వుంటారు. రామిరెడ్డి పట్టుకొచ్చిన పట్వారీని, యల్లమంద లాక్కొచ్చిన మస్తానును ఊళ్లో ఉంటానికి వీలులేదనితన్నితగిలేస్తారు. దేశముఖుపీడవిరగడై పోయినట్లు ఒక్క నిశ్వాసం విడిచి,

మళ్ళీ మిలిటరీ సంగతి జ్ఞాపకం వచ్చి, మళ్ళీ ప్రమాణాలు చేసి, ఎన్నాళ్ళనుంచో దేశముఖు చెరలో ఉన్న భూమిని 'ఆక్రమించుకుందాం' పదండి అన్న నినాదంతో "ఇది మా భూమే నోయ్" అంటారు. ఇదీ పోరాటానికి సంబంధించినంత మట్టుకు నాటక వస్తువు.

ఈ వస్తువు నేటి సంస్థాన ప్రజలు పడుతున్న యమయాతనలను ఎక్కడా చిత్రించడం లేదు; పై వర్గాల దురాగతాలు ఏవీ ఎత్తి చూపడం లేదు; పైవర్గాలకూ, ప్రజలకూ జరుగుతున్న సంఘర్షణ యొక్క తీవ్రతనూ దాని స్వరూపాన్నీ వ్యక్తం చేయడం లేదు. ఏదో ఒక మేకపోతును ఎత్తుకుపోకుండా దేవరపోతునే ఎత్తుకుపోవడమూ, ఎవరో త్రాగుబోతులు ఒక స్త్రీని అల్లరి చేయడం-ఇవే ఇవాళ ప్రజలందరినీ కలవరపరచి, అకస్మాత్తుగా ఐక్యత సాధించగల బలమైన సమస్యలు కావు. కనుక, ఒక్కరోజు కూడా లేని వ్యవధానంలో ఊరూ నాడూ కలిసినట్లు చూపడం—నేటి వాస్తవిక ప్రజా జీవితాన్ని, ప్రజా జీవిత సమస్యలనూ, ప్రజల రాజకీయ స్థాయినీ అర్థం చేసుకోవడం అనిపించుకోదు. తెల్లవారేసరికి దేశముఖుకు ఊళ్లో పుట్టగతులు లేకుండా పోవడానికి వీరారెడ్డి వగైరాలు ఏ సమస్యలనైనా తీసుకొని ప్రజలకోసం పనిచేసినట్లు సూచనైనా లేనప్పుడు ఇది ఎలా సమర్థనీయం కాగలుగుతుంది? ఇంత తేలికగానే ఐక్యత వచ్చేసినట్లయితే, రెండో రంగంలోనే దేశముఖును తన్ని తగిలెయ్య వచ్చుగదా, అతను పోలీసు బలగం తెచ్చుకున్నదాకా, ఆగడం దేనికి? ఈ దృష్టిలో 2, 3, 4, 5 రంగాలు నిరర్థకమవుతాయి. పోనీ, రెండో రంగానికి ముందే అందరూ ఐక్యమైనా, పోరాటానికి సిద్ధంగా లేరనుకుందాం. అయినా 2, 3, 4, 5 రంగాల్లో ఎక్కడా ఎవ్వరూ ఏ సమస్యమీదా ప్రజల్లో పనిచేసినట్లు లేదు. సంఘంలో కొత్తగా చేరినవాళ్ళన్నా ఉన్నారా అంటే వీరారెడ్డి భార్య సీతమ్మా, మంగలి రాముడూ తప్పితే మరెవరూ లేరు. దేశముఖు అయినప్పటికీ ఒక్క యల్లమంద చేత వేలుముద్ర వేయించుకోడం తప్పితే చేసిన దుండగం మరేమీ కన్పించదు. కనుక ఎలా చూసినప్పటికీ, 2, 3, 4, 5 రంగాల ప్రయోజనం ఏమిటో తేలదు. ఇక ఆరో రంగమయినా, ఇప్పుడున్న స్వరూపంలో నిలవదు. రంగ ప్రవేశంలోనే ఐక్యతతో దేశముఖును వెళ్ళగొట్టినట్లు చెప్పించి, 'ఇది మా భూమేనోయ్' అనవచ్చు. అప్పుడు దాదా సీతమ్మలు బలికానక్కరలేదు.

ఈ నాటక వస్తువు సంస్థానంలోని ప్రజాజీవితాన్నీ, వారి దుర్భర పరిస్థితులనూ, ఈ కష్టనిష్ఠూరాలనుంచి విముక్తి పొందాలనే వారి ఆశయాన్ని, దాని సాధనకోసం ప్రజలను ఐక్యపరచి సమీకరించడంలో వారు చేస్తున్న నిరంతర కృషిని వెల్లడించకపోగా, తేలగొట్టి పారేస్తున్నది. ఏమీ ప్రయత్నమూ శ్రమా లేకుండానే అన్నీ వాటంతటవే అకస్మాత్తుగా జరిగిపోతున్నట్లు చిత్రిస్తున్నది ఇలాంటి వస్తువు నేటి సంస్థాన ప్రజలకు ఎంతమాత్రం తోడ్పడజాలదు.

ఈ వస్తువు ఇంతటితోటే ఆగి పోరాటం మాటలతోటే ముగిసినట్లయితే అంత ప్రమాదం ఉండేదికాదు. కాని, జీవిత చిత్రణ అనుకునో ఏమో, రచయి

తలు దీన్ని సాగదీసి ప్రేక్షకులకు ప్రాకించి ప్రజాజీవితాన్ని నవ్వులపాలు చేసారు. లేవీ మాటమీద పట్వారితో ఘర్షణపడి ఇంటికి వచ్చిన వీరారెడ్డి, ఆ సంగతే మరచిపోయి, కమలా సీతమ్మల సరసాల్లో పాల్గొని మళ్ళీ దాదా వచ్చే దాకా 'తామరాకుమీది నీటిబొట్టు'లాగా వుండడం, కమల ఎవర్నో సంఘపెద్దను పెళ్ళిచేసుకోంటుందని తెలుసుకున్న సంఘ కార్యకర్తల్లో ఒకడైన దాదా "ఇంకేం! చిక్కులేదు, ఇద్దరూ చెరోక జెండా యేసుకొని ఊళ్ళెమ్మటి తిరగొచ్చు" నని అనడం; దీనికి కమల సిగ్గుతో తలవంచుకోవడం, 'సీతమ్మ నవ్వడం', వీరారెడ్డి ఇంట్లో ఇష్టాగోష్ఠిలో పొరపాటున జ్ఞాపకం వచ్చి, ఆత్మరక్షణ చేసుకోటానికి అప్పటికప్పుడు అందరూ అక్కడే డ్రిల్లు క్లాసులోలాగా లేచి నుంచోటం, పోలీసు దాడి వస్తున్నదని తెలిసి కమల ఇంట్లో బల్లమీద వడిసెల తీసుకునిల్చోడం, సీతమ్మ 'నవ్వుతూ' "కిందుండి రాళ్ళందించనా?" అని వేళాకోళం చెయ్యడం, మాటిమాటికి పెళ్ళికాని కమలను ఎవరైనా చెరుస్తారని కమల ఎదుటా, కమలతోటి అనడం; దాన్ని అందరూ హర్షించి ఊరుకోడం. వీరారెడ్డి కమల పెండ్లిసంగతి మాట్లాడేసందర్భంలో తిరణాల రౌడీలమాటవచ్చి, "అమ్మాయి కంటే ఇవ్వాళే గబగబా పెళ్ళిచేసి పంపించామే అనుకో. రేపు నీ జోలికే వస్తారు, అప్పుడైనా ఎదిరించక తప్పదుగా" అని భార్యకు ప్రబోధం చెయ్యడం, ఈమాటల ధోరణిలో ఆమెచేత "ఎందుకు నిలబడం; మీతోపాటే మేం" అనిపించి, దొంగనోటు వ్రాయించుకొనే వాడిలాగా, అప్పటికప్పుడు చెల్లెలుచేత సభ్యత్వం పుస్తకం తెప్పించి సీతమ్మ వేలుముద్ర వేయించుకోడం; వీటన్నిటినీ మించి సమస్యలు చర్చించేమధ్య, గొల్లయల్లమంద 'టుర్ కీ' అని అసమస్యల ప్రాధాన్యాన్ని అపహాస్యం క్రిందికి దించడం ... ... ఇలాంటివన్నో కలిసి, ఈ నాటకంలో ప్రతిబింబించబడినట్లు రచయితలు చెప్తున్న సంస్థాన ప్రజాపోరాటానికీ, జీవితానికీ వికృతమైన అసభ్య స్వరూపం కల్పించాయి.

నాటకంగానీ కథగానీ కావ్యంగానీ— సాహిత్యం ఏదైనాసరే— మన ప్రజల వాస్తవిక జీవితాన్ని చిత్రిస్తూ; న్యాయంకోసం, సత్యంకోసం, సంఘాభ్యుదయం కోసం పోరాడే ఉత్తమ చైతన్యాన్నీ నైతిక శక్తినీ సంస్కృతినీ వ్యక్తిత్వాన్నీ మన ప్రజలకు అందజేయాలి అదే ఏకైకనా ప్రయోజనం. ఈ చైతన్యాన్ని నైతిక శక్తినీ సంస్కృతినీ వ్యక్తిత్వాన్నీ జీర్ణించుకోలేని వస్తువుద్వారా వీటిని ఎవ్వరూ ఏ కళారూపంలోను అందించలేరు. 'మా భూమి' నాటకం ఈ చేతగానితనాన్నే ప్రదర్శించుకుంది.

ఇందులో ఒకరంగానికీ మరో రంగానికీ ఎలా సంబంధం లేదో, అలాగే ఒక పాత్రకూ మరోపాత్రకూ కూడా లేదు; ఒక పాత్రలో కూడా ఒక క్రమబద్ధమైన గమనం లేదు. కనుకనే ఇందులోని అన్నిపాత్రలూ నిర్జీవంగా నీరసంగా, తప్పించుకోవాలని చూస్తూ, తప్పనిసరై, పట్టినట్లు మాట్లాడుతాయి; అన్నీ అసహజంగాను అసందర్భంగాను ప్రవర్తిస్తాయి.

కథానాయకుడైన వీరారెడ్డిపాత్ర తీసుకుందాం. తన చెల్లెలి వెంటబడి తాగుబోతులు పిచ్చికూతలు కూస్తారని విన్నప్పు

టికీ ఒక్క క్షణమైనా ఆందోళనపడడు; ఏమీ ఉద్రేకం రాదు. తీరా "పరువు పోయాక ఇంకా బతికేందు"కని సుభాన్ అంటే, అప్పుడు చౌకగాను అసభ్యంగాను "అయితే ఇంకేం? పరువుగా బ్రతకాలంటే అంతా సంఘంలో చేరతాం అని ప్రమాణం చెయ్యండి" అంటాడు. మొదటిరంగంలో బందగీ సమాధిప్రక్కన దేశముఖు సమాధికడితే బాగా ఉండేదన్న రామిరెడ్డికి జవాబు చెప్పేపాటి చైతన్యం కూడా అతనికి లేదు. మళ్ళీ ఆరో రంగంలో రామిరెడ్డే పట్వారీని గురించి అదే ప్రస్తావన తెస్తే, అప్పుడైనా "ఈ దేవతల గోరీల పక్కనా? ఈ నీముడికి గోరీ కట్టేది?" అని కసుల జవాబు చెప్పవలసి వస్తుంది. రెండో రంగంలో లేవీ సమస్య వచ్చినప్పుడు పట్వారీతో పోటీపోటీలు మాట్లాడడం తప్పితే ప్రజల కష్టసుఖాలను గూర్చి పల్లెత్తి మాట్లాడడు. సీతమ్మకు చైతన్యం కలిగించి, సంఘంలో ఏవిధంగా చేర్చిందీ లోగడ చర్చించాం. మూడు నాలుగు రంగాల మధ్య తెరమరుగున జరిగిన సభలోనైనా అతనికేమీ పాత్ర లేదు. నాలుగో రంగంలో దేశముఖు తనను లోబరచుకో జూచినప్పుడైనా ప్రజాప్రతినిధిలాగా ఒక్క అక్షరం పలకడు. ఎంతసేపటికీ తప్పించుకొని బయటపడాలనే చూస్తాడు. పోలీసుదాడి సమయంలో అతను రంగంమీద లేడు వచ్చాకయినా, గుండుదెబ్బతిని మరణశయ్యమీద ఉన్న దాదా సీతమ్మలను చూసినప్పటికీ, అతని హృదయం లవలేశమూ ద్రవించదు ఉద్వేగం కలగదు. మానవత్వానికీ మానవ స్వభావానికీ అతీతమైన అవ్యక్తుడు ఈ వీరారెడ్డి. ఇలాంటి కథానాయకుడిద్వారా ప్రజలకు నైతిక శక్తీ, చైతన్యమూ, సంస్కృతీ అందడం అసంభవం. పైగా, అతని అవగుణాలే అందుతాయి.

ఇక వీరారెడ్డి అనుచరులు, ఏ ఒక్కరు కూడా చైతన్యం కలవాళ్లు వ్యక్తిత్వం కలవాళ్ళూ కారు. తుపాకి దెబ్బలు తగిలినా వాళ్ళకు అబ్బా అనిపించదు. 'నలుగురితోపాటు నారాయణా' అనేరకం. కాని, ఇక్కడి విషాదసంఘటన ఏమిటంటే ఇందులో వీళ్లే ముందు నడవవలసిన వాళ్లు కావడం! ముస్లింపాత్రల్లో మతాభిమానపు ఊగిసలాట, మార్పు కనిపించవు ముఖ్యంగా యల్లమందపాత్ర నిరర్థకంగానయినా వుండక, ప్రవేశించిన ప్రతిరంగాన్నీ అవహేళనపాలు చేస్తుంది.

ప్రతిపక్ష నాయకుడు దేశముఖు జగన్నాథరెడ్డి. అతనిలో ఆ వర్గపు క్రౌర్యంగానీ కౌటిల్యంగానీ, ఠీవిగానీ దర్పంగానీ ఛాయగానైనా కన్పించవు అమీన్ దగ్గర నుంచి ముస్తాన్ దాకా ప్రతివాడు అతని దగ్గర రీవిగానే మట్లాడుతారు ఎవ్వరికి అతనంటే జంకులేదు కోటలోకి వచ్చినప్పుడు కూడా రైతులు అతన్ని లెక్క చెయ్యరు: అతనుకూడా ఎవర్నీ ఏమీ చెయ్యడు. అతని ముతావాళ్ళ ధైర్యమంతా అతని దగ్గరే; బయటికొస్తే పట్టి పిరికి పందలు.

ఇలా ఉభయపక్షాల్లోని పాత్రలనూ పరిశీలిస్తే, ఏ పాత్ర ఏ వర్గానికీ ప్రాతినిధ్యం వహించక, అన్నీ పాత్రలూ రచయితలకు మాత్రమే ప్రాతినిధ్యం వహించినట్లు స్పష్టపడుతుంది. ఇలాంటి నాటకం వాస్తవిక రచన అనిపించుకోదు; కేవలం ఊహావాదంలోకి దిగి చచ్చురకం

భావకవిత్వమవుతుంది. గోర్కీ చెప్పినట్లు నిర్జీవమైన ఈ భావకవిత్వం "రంగుపూసి వాస్తవాన్ని మరుగుపరచి, ప్రజల్ని సంతృప్తిపరచడానికి ప్రయత్నిస్తుంది"

ఈ నాటకంలో జాతీయోద్యమ ప్రభావాన్ని గానీ, ఇత్తిహాదుల్ ముసల్మీన్ మతావేశాన్ని గానీ, ఆంధ్రమహాసభా రాజకీయ ప్రభావాన్ని గానీ, అతిప్రధానమైన లెవీసమస్యమీద జరుగుతున్న పోరాటాల ప్రభావాన్ని గానీ, తెలంగాణ ప్రజలు తమ ప్రాణసమానంగా గౌరవించే నారాయణరెడ్డి ఎల్లారెడ్డి మొదలైన ప్రజానాయకుల ప్రభావాన్ని కానీ ఏ పాత్రా ప్రతిబింబించదు. పైగా మూడు నాలుగు రంగాల్లో కాంగ్రెసును కాంగ్రెస్ నాయకులను చౌకబారుగా వ్యాఖ్యానించడం జాతీయవాదులూ ఆంధ్రమహాసభ అనుయాయులూ అందరూ కలిసి ఒకే ఆశయ సాధనకోసం కృషి చేస్తున్న ఈరోజుల్లో ఇలాంటి వ్యాఖ్యానాలు ఏ ఉద్యమానికీ మేలు చేకూర్చవు. విమర్శకూ వెక్కిరింపుకూ భేదం వుంది. మీర్జాయిస్మాయిల్‌ను పెట్టి కాంగ్రెసును గానీ, గ్రామ పటేలును పెట్టి వల్లభాయి పటేలును గానీ సూచి హాపించడం మర్యాదా కాదు; మంచిదీ కాదు. ఇత్తెహాదు మతావేశాలను రెచ్చగొట్టి ప్రజలను చీలదీసి, నైజాం ప్రభుత్వాన్ని నిలబెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్న ఇత్తిహాదుల్ ముసల్మీనను ఊరికే ఎగనట్లు తోసివేసినంత మాత్రాన దాని విషస్వరూపం అంతరించదు. దాని తప్పుడు పంథావల్ల, అదే ప్రజల కెలా దూరమవుతున్నదో పాత్రలద్వారా నిరూపించవలసి వుంది ఇలాంటి రాజకీయ చిత్రణ లేని ఈ నాటకం కేవలం నిరర్థకమని చెప్పక తప్పదు.

ఇందులో ప్రతిపాత్రా, బజారుమనుష్యుల్లాగా, ఎప్పుడుపడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడ - స్త్రీ పురుష వివక్ష కూడా లేకుండా విచ్చలవిడిగా బూతులు మాట్లాడుతారు ఉదాహరణలు అనవసరం

ఈవిధంగా ప్రజాజీవితాన్ని అవాస్తవికంగాను, అనుచితంగాను, ఊహాజనితంగాను, అసభ్యంగాను చిత్రించడం ప్రమాదకరం ఇది ఏవిధంగాను అభ్యుదయ రచన అనిపించుకోదు.

—'ప్రయాగ'

[నీటి పంపకం – 56 వ పేజీ తరువాయి]

వారు. ఇలా ఒక రేతిరి కాదు! మూడు రేతిర్లు, మూడు పొగల్లు.

కరణం, మునసబులు తంత్రాలు పన్నుతా రనుకున్నాం గాని ఏమను కున్నారో ఆ వూసే ఎత్తలా. రైతులంతా ఆశ్చర్యపోయారు.

వారం రోజులు పోయి, ఒక నాడు పొలంలో నేనూ, లచ్చి, పొరుగు పొలాల్లో వాళ్లూ పాటలు పాడుకుంటూ పనిచేసుకుంటున్నాం లచ్చేమో గడ్డి మోపుతోంది ఎడ్లకి. నేనేమో నాగలాడిస్తున్నా.

ఓవర్‌సీరయ్య, అతని గుమస్తా ఆ పక్కల కొచ్చారు. గానీ మా దరికి రాలా, దొంగలల్లే దూరంగా వుండి కనిపెట్టి సూస్తుండారు.

లేని తమ దుఃఖమయ దరిద్రజీవితంలో ఏమీ లేదని వాళ్ళందరికీ ఏదో అస్పష్టమైన వున్న అభిప్రాయం వుంది. నా 'ఫోమా' యొక్క వాస్తవ ప్రతిమలైన ఈ వర్గముల బిడ్డలంతా, నిర్జీవమైన జీవితంలో పడిపోయి ఆ జీవితమంటేనే అసహ్యించుకొని ఏవో గాలిమేడలు కట్టుకుంటూ, త్రాగుడుకో వ్యభిచారానికో బలైపోయి, తమ జీవితాలను తగలేసుకున్నవాళ్ళు. ఫోమా గోర్డియెవ్ తాత మాయకిన్ కూడా అలాంటి అనేక స్వభావాల సంపుటీకరణమే. కాని, ఆ సంపుటీకరించడంలో నేను పొరపడలేదు 1905 తర్వాత 'మాయకిన్' అధికార హస్తగతం చేసుకోడానికి కార్మిక వర్గములు తమ శరీరాలతో సోపానం నిర్మించినప్పుడు ఈ 'మాయకిన్లు' తమ కార్మికవర్గ వ్యతిరేక పోరాటంలో వీసమెత్తుకూడా తీసిపోలేదు. అంతేకాదు. ఈనాటికీ తమ పూర్వపు దర్పాలకోసం ఇంకా కలలుగనడం ఈ 'మాయకిన్లు' మానలేదుకూడా.

వీధులవెంట తిరిగేవాళ్లనుగూర్చి నీ వెందుకు వ్రాసావని నన్ను యువకులు ప్రశ్నిస్తున్నారు

ఏదో విధంగా ప్రక్కవాళ్లను దోచుకొని వాళ్ల చెమటను దమ్మిడీలలోకీ, ఆ దమ్మిడీలను రూపాయలలోకీ మార్చుకోవడం మాత్రమే ఆశయంగాగల మధ్యతరగతి మనుషులమధ్య జీవించడంవల్లా; నా కు వ్రాసిన పదిహేనేళ్ళ రచయిత్రిలాగా నేను కూడా, అంతా ఒకే టంకసాలనుండి బైటపడ్డ రాగికాన్లలాగా కనిపించే ఆ దోపిడిగాండ్ర నికృష్ట జీవితమంటే తీవ్రంగా అసహ్యించుకోవడంవల్లా — వీధులవెంట తిరిగే వాళ్లను గురించి వ్రాసాను.

నా దృష్టిలో వీధుల వెంట తిరిగేవాళ్లు 'అసాధారణమైన' మనుష్యులు. ఎందుకంటే వీళ్లు ఏవర్గానికీ చెందరు. తమ వర్గంతోటి సంబంధాన్ని వీళ్లు తెంచేసుకొని అయినా వుంటారు, లేదా ఆ వర్గమే వీళ్లను బహిష్కరించి అయినా వుంటుంది. వీళ్లు తమ వర్గస్వభావాన్ని చాలా భాగం కోల్పోయివుంటారు. నిషినీ, నొవో గరాడ్‌లో, 'మిలియంకా'లో మంచిమంచి కలలుగనే నా సోదరుడు అలెగ్జాండర్ కాషిరిన్ అనే కడుపునిండిన మాజీవ్యాపారస్థుడూ, ఇటలీ చిత్రకారుడు టోంటినీ, ఒక బడిపంతులుగా వుండిన గ్లాడ్కోవ్, దొంగతనం చెయ్యడంలో ఆరితేరిన బారన్ బీ అనే ఒకానొక మాజీ అసిస్టెంటుపోలీస్ ఇన్స్పెక్టరూ, జెనరల్ నికోల్స్కీ అనే మారుపేరు పెట్టుకున్న గజదొంగ వాండర్ విలియట్ — వీళ్లందరూ 'గోల్డెన్ కంపెనీ' లో కలిసిమెలసి వుంటారు.

కాజాన్‌లో, గాస్ ఫ్యాక్టరీలో, ఇలాగే వివిధ రకాలనుంచీ వచ్చినవాళ్ళను దాదాపు ఇరవైమందిని చూసాను. ఒక 'విద్యార్థి' వుండేవాడు; అతని పేరు రాడ్లోవ్ గాని రజనోవ్ గానీ అయివుంటుంది అతను ఆరితేరిన జేబుదొంగ; దాదాపు పదేళ్ళ జైలుజీవితం' వుంది, వాస్కాగాషిక్ అనేవాడు మరొకడు అతను పూర్వం గవర్నర్ ఆంద్రియేవిస్కీ పదాతిదళంలో వుండేవాడు. రోడ్జీవిచ్ అనే అతను బెలో రష్యాజాతివాడు. ఇంజన్ డ్రైవరు, ఒక మఠాధిపతి కొడుకు డేవిడోవ్ పశువైద్యుడు. ఇదీ వరస. వీళ్ళలో ఎక్కువమంది రోగిష్టివాళ్లూ, త్రాగుబోతులూ. వీళ్ళలో తగాదాలు చాలా తరచుగా వచ్చేవి కాని, ఆ అన్యో

స్వత మాత్రం చాలా గాఢమైంది. ఎవరు ఏం సంపాదించినా, దొంగిలించినా అందరూ కలిసి సమిష్టిగా తిని తాగేసేవాళ్ళు. సాధారణ ప్రజలకంటే వాళ్ళ జీవిత పరిస్థితులు చాలా అసహ్యంగా ఉన్నాయని నేననుకున్నాను. కాని, వాళ్ళుమాత్రం మామూలు ప్రజలకంటే చాలా బాగున్నట్లే అనుకునేవారు. మామూలు ప్రజలకు లాగా తమకు పేరాస లేదనీ, ఒకళ్ళనుంచి ఒకళ్ళు ఎక్కువ గుంజుకోడానికి తాము చూడడంలేదనీ, డబ్బు దాచిపెట్టుకోడంలేదనీ నిజంగా వాళ్ళ నమ్మకం.

ఈ వీధులవెంట తిరిగేవాళ్లలో వింత వింతరకాల మనుష్యులున్నారు. వాళ్ళను గురించి నాకు తెలియని సంగతులుకూడా అనేకం వున్నాయి. నాకు వాళ్ళమీద చాలా ఇష్టంకూడా. ఎందుకంటే__ వాళ్లు తమ జీవితాన్ని గురించి ఎప్పుడూ చెప్పుకోరు. మర్యాదస్థుల సుఖ జీవితాన్ని గురించి అపహాస్యంగాను, వ్యంగ్యంగానుమాట్లాడుతారు. అయితే__ అది అసూయవల్లా కాదు, అందని ద్రాక్షపళ్లు పులుపనీ కాదు, కాని_ మంచి జీవితం గడపలేకపోయినప్పటికీ, ఆ 'బాగాజీవించే' వాళ్లకంటే తాము గొప్పవాళ్లమనే గర్వం వల్ల మాత్రమే.

'ది హాస్‌బీన్స్'లో నేను వర్ణించిన కువాల్డాను నేను మొట్టమొదటిసారి న్యాయస్థానంలో విచారించబడుతుండగా చూసాను. ఆ చింపిరిగుడ్డలు కట్టుకున్న అతను న్యాయమూర్తి ప్రశ్నలకు ఎంత ఆత్మగౌరవంతో జవాబు చెప్పాడో, పోలీసు వాడికీ, ప్రాసెక్యూటరుకూ, తాను తన్నిన సత్రం యజమానికీ ఎంత అసహ్యంతో జవాబు చెప్పాడో చూసి ఆశ్చర్యపడ్డాను.

ఒడెస్సాలో నేను వీధులవెంట తిరిగేవాణ్ణి మరొకణ్ణి చూసాను అతని కథే నేను నా 'షెల్కాష్' అనే కథకు ఉపయోగించుకున్నాను. ఈ మనిషిని నేను ఆసుపత్రిలో కలుసుకున్నాను ఇద్దరం జబ్బుతో ఆసుపత్రిలో పడివున్నాము. ఏదో పనికోసం తాను పెట్టుకున్న పిల్లవాడు తనను ఎంత నీచంగా మోసగించాడో చెప్పి, తన కథ ముగిస్తూండగా, అతని అందమైన పలువరసను వెలిగించిన ఆ నవ్వు ఇంకా నాకు జ్ఞాపకము వస్తుంది "ఓరి సన్యాసీ! పో, పోయి నీ పొట్టనింపుకో" అని ఆ పిల్లవాణ్ణి వదిలివేసాడట!

అతన్ని చూస్తే డ్యుమాస్ రచనలోని ఉత్తమవీరులు నాకు జ్ఞప్తికివచ్చారు. మేమిద్దరం ఒకేసారి ఆసుపత్రినుంచి బయటకు వచ్చాం. త్రోవలో ఒకచుకాంలో ఉండగా అతడు నాకు ఒక సలహా చెప్పాడు.

"నాతో వచ్చి ఏదన్నా మంచి పని చూసుకోడం నీకిష్టమే ననుకుంటా. నీవు బాగా చేసుకుపోగలవనికూడా నానమ్మకం."

ఈ సలహాతో నేను చాలా ఉప్పొంగిపోయాను. కాని_ జూదాలాడడం, దొంగతనాలు చెయడంకంటే నేను చేయగల మంచి పనులున్నాయని నాకు అప్పటికే తెలుసు.

కనుక, వీధులవెంట తిరిగేవాళ్లను నేను ఏరుకోడానికి నీచమైన మధ్యతరగతి మనుష్యుల్ని కాక 'అసాధారణ' వ్యక్తులను చిత్రిద్దామనే కోరిక కారణమని చెప్పవచ్చు. నిజానికి ఇందుకు విదేశసాహిత్యం, అందులోను మన రష్యన్ సాహిత్యంకంటె ఉత్తమమైన, రసవంతమైన ఫ్రెంచి సాహిత్యంయొక్క ప్రభావం కొంత కారణం కావచ్చు. కాని నన్ను ఎక్కువగా కదిలిం

చింది ఏమిటంటే__ ఆ పదిహేనేళ్ళ రచయిత్రి వ్రాసినట్టుగా, 'అడుక్కుతినే ఈ దుఃఖమయజీవితాన్ని' నా భావనాశక్తితో కళావంతం చెయ్యాలనే కోరిక.

నేనిదివరకే చెప్పాను__ ఈ కోరిక భావకవిత్వధోరణిలోకి వస్తుంది.

నా దృష్టిలో మనిషికందని భావాలు లేవు, అన్ని వస్తువులనూ, అన్ని భావాలనూ మనిషే సృష్టించాడు, అతనే అనేక అద్భుతాలుచేసి చూపించాడు, భవిష్యత్తులో ప్రకృతి శక్తులమీద పెత్తనం చలాయిస్తాడు. ఈ మన ప్రపంచంలోని అత్యంత సుందరవస్తువులన్నీ కూడా శ్రమశక్తితో, నేర్పరులైన కష్టజీవులు సృష్టించినవే మన అన్నిభావాలూ అన్ని ఆశయాలూ కూడా, శాస్త్ర చరిత్రల్లో చూపబడినట్లు మానవ శ్రమ క్రమపరిణామం చెందడంలో నుంచిపుట్టినవే. వాస్తవాల ననుసరించే భావాలు వస్తాయి. మానవుడంటే నేను తలవొగ్గుతాను ఎందుకంటే మూర్తికట్టిన అతని హేతుజ్ఞానమూ, భావనాశక్తీ తప్పితే, ఈ ప్రపంచంలో నాకేదీ కనిపించడంలేదు గదా, ఏదైనా ఉన్నట్లుకూడా అనిపించటం లేదు కాబట్టి.

పవిత్రమైన విషయాలను గురించి మాట్లాడడం అవసరమనుకుంటే ఒక్కమాట చెబుతాను తనమీదనే తన అసంతృప్తి ఇంకా అభివృద్ధి చెందాలనే మానవుడి ప్రయత్నమూ పవిత్రమైనవి. తాను సృష్టించుకొన్న నైచ్యాన్ని అంతటినీ ద్వేషించడమనేది పవిత్రమైనది. పేరాసనూ అసూయనూ క్రౌర్యాన్నీ వ్యాధినీ యుద్ధాన్నీ ప్రపంచంలో మనిషిమనిషికీ మధ్యవుండే అన్ని విరోధాలనూ అంతమొందించాలనే అతని కోరికా పవిత్రమైనది; అతని శ్రమపవిత్రమైనది.

—'లిటరేచర్ అండ్ లైఫ్'నుంచి

★

"ఆకులందున అణగి మణగీ
కవిత కోయిల పలుకవలెనోయ్,
పలుకులను విని దేశ మందభి
మానములు మొలకెత్తవలెనోయ్!"

— గురజాడ

విశ్వసాహిత్యాన్నీ
భారతీయసాహిత్యాలనూ
సమన్వయించుకొని, జాతీయాభ్యుదయానికీ
కళాభ్యుదయానికీ దారితీసే-
ఉత్తమ సాహిత్యపత్రిక

అభ్యుదయ

విడిప్రతి : అ. 6 సం.చందా : రు. 5

వెంటనే చందాదార్లుగా చేరండి !

మీ ప్రతికోసం జాగ్రతపడండి !

'అభ్యుదయ'కూ
అభ్యుదయ ప్రచురణలకూ
అన్నిచోట్లా ఏజెంట్లు కావాలి.

వివరాలకు :

మేనేజరు, 'అభ్యుదయ' బెజవాడ.

Editor, Printer & Publisher : C. Pitchayya
Secretary, Andhra Progressive Writers' Association, Governorpet,
Printed at Abhyudaya Press, Bezwada. Q. H. No. K. 3. A